పావురాలు

శ్రీ తాడిగిరి పోతరాజు

మూగపావురాలు ఎగిరిపొయ్యాయి. గాలిలో తేలిపోతున్నాయి. గుంపులు, గుంపులుగా, రెపరెప రెక్కలు కొట్టుకొంటూ, ప్రపంచానికి దూరమైపోతున్నాయి. నీలాల నింగిపై పయనిస్తున్నాయి ఆ పిలుపువిని తృళ్ళిపడ్డ పావురాలు.

"అల్లాహెూ......అక్బర్......అల్లాహెూ". సుదీర్ఘంగా వినబడుతోంది ఆ కేక. ఆ విశాలమైన మసీదులో ఆ కేక ప్రతిధ్వనిస్తోంది. చెవుల్లో వ్రేళ్ళు పెట్టుకొని, నెత్తినటోపి పెట్టుకొని అరుస్తున్నాడు ముస్లిం మతగురువు ముల్లా.

మళ్ళీ వినబడింది ఆ పిలుపు హెచ్చుస్థాయిలో.

అల్లాహెూ......అక్బర్......అల్లాహెూ

అసహ్యాభావంతో తొంగిచూసింది, ఏళ్ళు ముదిరి కీళ్ళు సడలిన ముసలి పావురం. ఆ శబ్దం వస్తున్న వైపుచూసి, వెకిలి నవ్వు నవ్వింది.

వెంటనే ఆత్మీయ పరిజనాన్ని అనుసరించింది. తన సోదరులందరినీ దేవుని మందిరానికి రమ్మని సందేశమిచ్చిన 'ముల్లా' తృప్తిగా మెట్లు దిగాడు.

విధిలేక నిలబడిన 'సెంట్రీ పోలీసు'ల్లా నిర్లక్ష్యంగా నిలబడిన గోపురాలు నిట్టూర్పు విడిచాయి. తమ హృదయ కుహూరాల్లోనుండి వెళ్ళిపోయిన పావురాలను చూసి, విలపిస్తున్నాయి. తదేకంగా చూస్తున్నాయి అవి వెళ్తున్నవైపు.

దక్కన్ చిత్రలేఖనానికి మచ్చుతునకగా నిర్మించబడింది ఆ మసీదు. అందంగాఉన్న దాని గోపురాలు గగనంలోకి పోను పోను సన్నబడిపొయ్యాయి. గోపురం చివర ఒక చందమామ. నిషాలో ఉన్న నిజాం నవాబులా మత్తెక్కి పడుకొన్నాడు. ప్రక్కనున్న నక్షత్రం జోలపాడుతోంది.

పదిమందిజట్టు ఒకటి మసీదుమెట్లు అధిరోహిస్తోంది. వాళ్ళమధ్యనున్న వ్యక్తి, ఆ స్థూలకాయంపై పిగిలిపొయ్యేటట్టు ఒక ఖరీదైన షేర్వాణి వేసికొన్నాడు. పాకిస్తాన్, భారత దేశాలకున్న వైషమ్యాలనుగూర్చి, అక్కడున్న పరిమిత ప్రజాస్వామ్యపు విలువలనుగూర్చి ఉర్దూలో అనర్గళంగా ఉపన్యసిస్తూ, మెట్లు అతికష్టంగా ఎక్కుతున్నాడు. ప్రక్కనున్న శ్రోతలు, అతని అభిప్రాయాలకు సుముఖతనుగానీ, విముఖతనుగానీ వ్యక్తపరచక, వినయంగా చేతులు కట్టుకొని వెంట నడుస్తున్నారు.

ఇంకా నాలుగు మెట్లు ఎక్కాలి. చటుక్కున ఆగిపొయ్యాడు. ఎర్రగా ఇంతలావున ఉబ్బిపోయిన మెడను రుమాలతో తుడుచుకొన్నాడు.

ఆపై మెట్టుపై ఒక వృద్ధుడు నిర్లక్ష్యంగా అటు తిరిగి కూర్చున్నాడు. అతనివెనుక ఆగిపోయిన మహనీయులను గుర్తించలేదు. సూర్యకాంతిలో ఆ బట్టతల 'నిగనిగ' మెరసిపోతోంది. చిరిగిపోయిన చెప్పులు, విడాకులు పుచ్చుకొన్న 'భార్యాభర్త'ల్లా అటొకటి ఇటొకటీ పడిఉన్నాయి.

అతను నిశ్చల నిర్నిమేష దృక్కులతో పావురాళ్ళను వీక్షిస్తున్నాడు.

పరిసర ప్రభావానికి అతీతంగాఉండి, స్వీయానుభూతుల్లో విహరిస్తున్న అతని అసాధారణ ధోరణి, ఆ ఖరీదైన షేర్వాణిపెద్దమనిషికి హాస్యాస్పదంగానూ, అసహ్యంగానూ కనిపించింది. అతని రాకను గమనించి, వంగి సలాంకొట్టి 'క్షమించండి హుజూర్' అంటూ ప్రక్కకు తప్పుకోనందుకు అతని ముఖం, గచ్చుమీదబడ్డ కిరసనాయిల్లా ప్రకోపించింది.

కోపంగా చూశాడు.

అతను పావురాళ్ళను చూస్తున్నాడు.

'కౌన్—హై—యే పాగల్? (ఎవరీ పిచ్చివాడు?)

సైకిల్ ట్యూబు 'బరస్ట్' అయినట్టు అతనికంఠం పగిలింది. ఆ ముసలివాడి ఏకాగ్రతకు భంగం కల్గింది. సృష్టి విచలితమైంది.

వెనుతిరిగి చూశాడు.

తెల్లగా జనపనారపీచుతో తయారు చేయగడిన గడ్డం, శుష్కించి లోనికి పీక్కుపోయిన ఆ ముసలి దవడలను కప్పుతోంది. కనుబొమలు కూడా తెల్లగా ఉన్నాయి. ఎర్రగాఉన్న అతనిముక్కు ఆకాశంలో దేనినో చూస్తున్నట్టు కొనతేలిఉంది.

ఆ ముసలివాడు నొసటిపై చెయ్యి అడ్డం పెట్టుకొని వాళ్ళను పరీక్షగా చూశాడు.

అవ్యక్తమైన భావాలతో ఆ చూపులు నిండిఉన్నాయి. లోతుగా పీక్కుపోయి, అగాధమైన లోతులతోఉన్న ఆ కళ్ళలో అతని హృదయం మూల్గుతూంది. ఎన్నో భావాలూ, వ్యథలూ, గాథలూ ఆ కళ్ళలో స్థిరనివాస మేర్పరచుకొన్నాయి. 'కాన్సర్' వ్యాధిలా భ్రుకుటి కుంచించుకొన్నాడు. మెట్లపై నిలబడిన వారిపై ధగధగ ఎండ పడుతోంది. ఎండలో ఖరీదైన షేర్వాణి మిలమిల మెరుస్తోంది.

"ఎవడీ పిచ్చివాడు. దారికడ్డంలెమ్మని చెప్పండి." హుకుం జారీ చేశాడు ప్రక్కవారిని ఉద్దేశిస్తూ, ఖరీదైన షేర్వాణి.

ముసలివాడి చూపుల్లో అసహ్యం, కోపం వెల్లువలా ముంచుకొచ్చాయి. చివ్వున లేచాడు కాష్ఠంపై సగం కాలిన శవంలా. పెదవులు తీవ్రంగా వణికాయి. నాసికారంధ్రాలు విప్పారాయి.

హృదయంపై చెయ్యి వేసికొని "నేనుకాదు పిచ్చివాణ్ణి.... నువ్వు......మీరంతా......మతంపేరిట మారణ హోమం చేశారు. మతోన్మాదులై అమాయిక ప్రాణాలను ఎన్నిటినో, మీ పొట్టన పెట్టుకొన్నారు....ఈతప్పు......ఈ పాపాన్ని అల్లా ఎన్నటికీ క్షమించడు......" అన్నాడు సుడిగాలికన్న వేగంగా.

ఆ ఘనత వహించిన స్థూలకాయం, కలవరంచెంది చుట్టూ పరికించి చూసుకొన్నాడు భీతితో. ఎర్రటోపీలు కన్పించలేదు. గాలి కొట్టిన 'ఎయిర్‌పిల్లో'లా అతనిగుండె ధైర్యంతో నిండుకొంది.

"బద్మాష్! ఏమిటి?....నీవు మాట్లాడేది!" ఆ శుష్క వదనంపై దెబ్బ చడేలున మ్రోగింది.

అతను ఒక ప్రక్కకు ఒరిగాడు. ప్రేక్షకుల్లో ఇద్దరు ఆతురతతో వచ్చి పట్టుకొన్నారు. నెమ్మదిగా ఆ మెట్టుపై కూర్చోబెట్టారు.

ఒక్కక్షణం నిశ్శబ్దం. ఇద్దరిలో ఒకడు పళ్ల కొరుక్కొన్నాడు. చేతులు నలుపుకొన్నాడు "దాదా పిచ్చివాడు సాబ్..... మనస్సు స్థిరంలేదు......మీ రితన్ని కొట్టటం" అంటూ చూపులు క్రిందకు దింపుకున్నాడు. మాట పూర్తి చెయ్యలేక నీళ్ళు నమిలాడు. అతని కన్నులలో మెరపులా ఎర్రనిగీత మెరసింది.

"పిచ్చివాడయితే........ఎవరితో మాట్లాడుతున్నాడో గుర్తించక్కర్లేదా?" శాసించినట్లుగా గొంతు చించుకొన్నాడు.

పిచ్చివాళ్లుకానీ, మంచివాళ్ళుకానీ, "పేదలూ, ధనికులూ సమంగా పన్నులు కట్టినట్టు" ప్రభువులను గౌరవించి తీరాల్సిందే. ఇటువంటి విచక్షణకు తావులేదు.

ఖరీదైన షేర్వాణి ఒక మెట్టు పైకి కదిలింది. రైలు పెట్టెల్లా అందరూ కదిలారు. అతను మళ్ళీ ఆగాడు. జేబులో నుండి రెండు రూపాయలనోటు తీశాడు. తన దయార్ద్ర హృదయాన్ని ప్రకటించుకొంటూ, ప్రచారం చేసికొంటూ ఆ నోటు 'దాదా'పై విసిరాడు.

అందరూ మసీదులోనికి నడిచారు. ఒకవ్యక్తి 'దాదా'కు జేబుగుడ్డతో ముహం తుడిచి, మంచినీళ్ళు త్రాగించాడు. కుడి చెయ్యి 'దాదా'కు ఆసరాగాపెట్టి మసీదులోకి వెళ్తూన్న ఆ ఖరీదైన షేర్వాణి కేసి, కొర కొర చూశాడు.

"దాదా కొడుకు ఈరోజున బ్రతికి ఉన్నట్లయితే నీబోటి వాళ్ళందరూ దాదా కాళ్ళక్రింద బలాదూర్......గులాంగిరీ క్కూడా పనికిరారు"—......అన్నాడు కోపంగా.

మసీదులో ప్రార్థన ప్రారంభించబడింది.

ప్రార్థనలో పాల్గొనేటందుకు వేగిరపడిం దతని హృదయం. 'వద్దులే' అని వారించింది బుద్ధి. "దాదా" కుమారుని తాలూకు స్మృతులు అనివార్యంగా, అతని కళ్ళముందు పైశాచిక నృత్యం చేస్తున్నాయి.

పారిపోవాలని యోచించే 'ఖైదీ'ని పరివేష్టితమైన శృంఖలాలు నిర్బంధించినట్లు, అతనిలోరేగిన స్మృతులను "దాదా" సన్నిధినుండి కదలనియ్యక నిర్బంధించాయి. అతను, 'దాదా' కేసి చూశాడు. నిట్టూర్పు విడిచాడు. అతని ఆలోచనలు కొన్ని సంవత్సరాలు వెనక్కి నడిచాయి.

కళ్ళముందు పైశాచిక ప్రళయతాండవం.

నగరమంతా భీభత్సంగా ఉంది. హిందూ, ముస్లింలమధ్య సంకుల సమరం జరుగుతోంది. చిన్నకార్లు నిర్విరామంగా తిరుగుతున్నాయి. వాటిల్లో అమర్చిన 'లౌడ్‌స్పీకర్ల'నుండి ఆవేశపూరితమైన మాటలు వినబడుతున్నాయి. 'రజ్వీ' జిందాబాద్'— 'హైద్రాబాద్ వర్థిల్లాలి' అనే నినాదాలు చెవుల్లో గింగురుమంటున్నాయి.

రాత్రివేళ శ్మశానంలో ఎర్రని కన్నులతో గస్తీ తిరిగే తోడేళ్ళ గుంపులా 'రజాకార్' ఉద్యమ నాయకులు ఎర్రని టోపీలు పెట్టుకొని నగర వీధుల్లో గస్తీ తిరుగుతున్నారు. మనుష్యుల్ని చంపటం ఒక మహోద్యమంగా ప్రచారం చేస్తున్నారు. మునిసిపాలిటీవాళ్ళు కుక్కలను వేటాడినట్లు హిందువులను వేటాడుతున్నారు 'రజాకార్'లు. హైద్రాబాద్ రాష్ట్ర వ్యాపకంగా ఈ ఉద్యమం అమలులోఉంది.

ఎన్నో సంవత్సరాలుగా, ప్రశాంతంగా బ్రతుకులు వెళ్ళదీసిన హిందువులు ఇళ్ళూ, వాకిళ్ళూ వదలి "నాంపల్లి" స్టేషన్ వైపు పురోగమిస్తున్నారు. ఆడవాళ్ళు వణుకుతున్న కాళ్ళతో, చంకలనుండి జారిపోతూన్న చంటిపిల్లలతో స్టేషన్‌వైపు పరుగెత్తుతున్నారు. మగవాళ్ళు చెమటల్లు కారుతున్న ముఖాలతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ముందు నడుస్తున్నారు. నడికారు పిల్లలు పెద్దలతో నడవలేక పరుగెత్తుతున్నారు.

హిందువుల కళ్ళముందు మృత్యగహ్వరం కనుపిస్తోంది.

తాను నడుస్తున్నాడు......

'చౌరాస్తా' సమీపించాడు.

ఒక జీప్‌కారు 'చౌరాస్తా'లో ఆగింది. ఆవేశ పూరితమైన ఉపన్యాసం దానిలోనుండి వెలువడింది.

"సోదరులారా......అల్లా మనకోసమై ప్రత్యేకించిన ఈ రాజ్యంలో హిందూకాఫర్‌లు కూడా ఉన్నారు. వందలాది సంవత్సరాలుగా మనతో సహజీవితాన్ని కొనసాగనిచ్చిన ఫలితంగా ఇప్పుడు మనకే ద్రోహం చేస్తున్నారు. మనదేశాన్ని 'భారత్' యూనియన్'లో కలిపి వేయటానికి వారు ముఖ్య సాధనాలు. ఈ పరిస్థితుల్లో మనకు రక్షకుడని నమ్మిన రాజుకూడా యూనియన్‌లో కలవటానికి మంతనాలు సాగిస్తున్నాడు......సోదరులారా......భయపడవద్దు......ఈ విపత్కర పరిస్థితుల్లో హైద్రాబాద్ విముక్తికై, కంకణం కట్టుకొన్న అల్లా ప్రియపుత్రుడు

కాశిం రజ్వీ......ఈ విమోచనోద్యమానికి సారథ్యం వహిస్తున్నాడు.....యోధుడు......ప్రజ్ఞాశాలి......వారి అడుగుజాడల్లో నడిచి దేశ స్వాతంత్ర్యం కాపాడండి......యువకులందరూ సైన్యంలోచేరి హిందూ కాఫర్‌లను వెళ్ళగొట్టండి". ఖరీదైన షేర్వాణి, ఎర్రకుచ్చుటోపి నెత్తిన పెట్టుకొని, కోరమీసం సొగసుగా నాట్యంచేస్తూండే మూతివద్ద 'మైక్' పెట్టుకొని ఊపిరాడకుండా ఉపన్యాసమిస్తున్నాడు. యువకులను కర్తవ్య పథంలో నడిపిస్తున్నాడు.

మసీదులోనుండి ఏకకంఠంతో ఏవో మాటలు వినవచ్చాయి. ఒక్కక్షణం స్మృతులగాఢపరిష్వంగం వదిలింది. వెనక్కి తిరిగి చూశాడు.

అందరూ చేతులు ముకుళించి, తలలు వంచుకొని మత గురువు పలుకులకు ప్రతి సమాధానం లయ చెడకుండా చెబుతున్నారు.

ఆ ఖరీదైనషేర్వాణీవ్యక్తిని పరిశీలనగా చూశాడు.

నెత్తిమీద, నల్లటి జిన్నాటోపీఉంది. కోరమీసంలేదు. మూతి నున్నగాఉంది.

చూపు త్రిప్పుకొన్నాడు.

జీప్ కదలిపోయింది కళ్ళలో.

మలుపు తిరిగాడు.

అక్కడ ముస్లిం యువకులు సమావేశమై ఉన్నారు. వాళ్ళ ముఖాలలో క్రౌర్యం, అసహనం స్పష్టంగా కనిపిస్తున్నాయి. పిడికిళ్లు గట్టిగా మూసికొని, దేనికోసమో ఎదురుచూస్తున్నారు. తను వాళ్ళను త్వర త్వరగా సమీపించాడు.

ఒక 'రజాకార్' ఆ స్థలానికి పరుగెత్తుకొంటూ వచ్చాడు. అతని మాటలువిని కుర్రవాళ్ళందరూ కత్తులు బయటికితీసి, ప్రమాణంచేసి, లోపల పెట్టుకొన్నారు. అందరూ 'బాగో— బాగో' అనుకుంటూ పరుగెత్తారు.

ఆ మాటలు స్ఫురణ కొచ్చేసరికి, అతని గుండె మరొక సారి ఎత్తుగా ఉబ్బింది. గడ్డం తుడుచుకొని మళ్ళీ ఆలోచించ సాగాడు.

తను పరుగెత్తబొయ్యాడు.

దాదా ఎదురుగా వస్తున్నాడు. 'ఆగ'మన్నట్టు సైగ చేశాడు.

'బాబా—ఎవర్ని చంపింది?......మనవాళ్ళందరూ ఇప్పు డెక్కడికి వెళ్తున్నారు. విశేషాలేమిటో పూర్తిగా చెబుతావా". ఆతురత వ్యక్తమౌతోన్నకంఠంతో దాదా ప్రశ్నించాడు.

"మన వాడ్నొకణ్ణి ఈరోజు ఉదయం హిందువులు హత్య చేశారు—అంటే ఒక గంటక్రితం—ఆ కారణంచేత ఇప్పుడు చాదర్‌ఘాట్‌వద్ద వాళ్ళకూ, మనకూ భయంకరంగా కొట్లాట సాగుతోంది. మనదేశంలో నివసిస్తూ, మనకు 'గులామ్'ల్లా ఉండక మనపై ఆధిపత్యం చెలాయిస్తారా ఈ హిందూకాఫర్‌లు". జాతిపట్ల తనకున్న ప్రేమను, దేశాభిమానాన్ని వ్యక్తపరుస్తూ, ఇంకా ఏమో చెప్పబొయ్యాడు తను. కానీ దాదా అసహనంతో,

"అకారణంగా మనవాణ్ణి ఎలా చంపుతారు?......ఇది నమ్మశక్యం గాకుండా ఉంది" అని అడ్డుప్రశ్న వేశాడు.

'నేను చెప్పేది నిజం—అకారణంగానే చంపారు దాదా..... అబద్ధాలుచెప్పి, నిన్ను నమ్మించవలసిన అవశ్యకత నా కేముంది— మన ముస్లిం కుర్రాడొకడు కాలేజీకి వెళ్తూంటే హిందూ గూండాలు అతన్ని హత్య చేశారు నడివీథిలో......ఇది సహించరాని విషయం.....'

అప్రతిభుడైపొయ్యాడు దాదా. "కాలేజీ విద్యార్థా? నీవు చూశావా అతన్ని.....ఎలా ఉంటాడో తెలుసా" ప్రశ్నలవర్షం కురిపించాడు దాదా.

"నేనూ ఇప్పుడేకదా విన్నాను—ఎర్రగా పొడుగ్గా ఉన్నాడట...... 'ఖాన్‌భాయ్' అన్నపేరుమాత్రం విన్నాను...... నేను త్వరగా అక్కడకు వెళ్ళాలి......నేను తిరిగ్గా నీకా విషయాలు చెప్పటాని కిది సమయంకాదు.....మన్నించు" అంటూ తను పరుగెత్తబొయ్యాడు.

'ఖాన్'—దాదా గొంతులోనే ఉండిపొయ్యాయి ఆ మాటలు.

"బాబూ నన్ను ముందు ఆ 'చంపిన స్థలానికి' తీసికెళ్ళు.... తరువాత 'చాదర్‌ఘాట్'వద్దకు వెళ్దువుగాని.....బాబ్బాబు......నీ కడుపున పుడతాను.......ఈ ముసలివాడికి సహాయం చెయ్యి...... అల్లా నిన్ను దీవించుతాడు......బాబూ" జాలిగొలిపే కంఠంతో దాదా బ్రతిమాలాడు.

దాదా రోడ్డుపై కూలబడ్డాడు.

'తప్పక తీసికెళ్తాను దాదా'. తా నన్నాడు.

రిక్షాను పిలిచాడు. రిక్షా వీధులన్నీదాటి, మెయిన్ రోడ్డుతో కలుపుతూన్న ఆ మలుపులో పయనించ సాగింది. ఆ ప్రదేశంలో 'ఎక్కువ'గా హిందువులు నివసిస్తూంటారు. రోడ్డుపై గుంపులు గుంపులుగా ముస్లిం విద్యార్థులు సమావేశమై ఉన్నారు మరణించిన వ్యక్తిపట్ల సానుభూతిని వ్యక్తపరుస్తూ. హత్యకు సంబంధించిన కారణాలనుగూర్చి, రక రకాలుగా మాటలు వినవస్తున్నాయి. పంజాబీ దుస్తుల్లోఉన్న ముస్లిం యువతులు కూడా ఉన్నారు.

"ఖాన్‌భాయ్ ఒట్టి అమాయకపు మనిషి.....ఒంటరిగా తిరగకూడదు—పరిస్థితులు అధ్వాన్నంగా ఉన్నాయంటే వినిపించుకోక, నన్నెవరు కొడ్తారని ధీమాతో తిరిగి ఇంత చేసికొన్నాడు" డగ్గుత్తికతో పెదవి కరచి పట్టుకొని అంటోంది ఒక విద్యార్థిని.

"ఖాన్‌భాయ్ హిందువులనునమ్మి, స్నేహం చేసిన ఫలిత మిది—అతని హృదయాన్ని అర్థం చేసికొనే శక్తి ఎవరికుంది?.... బద్మాష్‌లు..." ఓ రెండు జడల అమ్మాయి గొంతు కోపంతో మిళితమైన బాధతో అంది.

'చదువుకొన్న మూర్ఖులు—రోగ్స్' ఒక యువకంఠం అంది.

ఆరిపొయ్యేదీపం రెపరెపలాడుతూ క్రొత్త వెలుగు వెదజిమ్మినట్లు, ముసలి దాదా ఎవరి ఆసరా లేకుండా రిక్షా దూకాడు. అందర్నీ తోసికొంటూవెళ్ళి, ఆ మరణించిన వ్యక్తిని చూడసాగాడు.

తల గడ్డకట్టిన నెత్తురు మడుగులో అంటుకుపోయింది. అతని ఉంగరాలజుత్తు ఆ రక్తంలో జీరాడుతోంది. తెల్లటి మెదడులాటి పదార్థం ప్రక్కనేఉంది. దానిపై ఈగలు ముసురుతున్నాయి. కనురెప్పలు మూసికోకపోవటంవలన, నిశ్చలంగాఉన్న ఆ గాజు కళ్ళు అందరికేసీ కన్నార్పక చూస్తున్నాయి. అతను ధరించిన తెల్లని పైజమా, చొక్కా పవిత్రంగా ఆచ్ఛాదిస్తున్నాయి—పుస్తకాలు అల్లంతదూరాన పడ్డాయి.

భీరువు గుండెల్లో భయాన్ని పిండుతూ, మతోన్మాది హృదయంలో ఆనందాన్ని రేకెత్తుస్తూ, మానత్వమున్న మానవుని హృదయాన్ని బద్దలు చేస్తూన్న ఆ దృశ్యాన్ని దాదా రెప్ప కొట్టక రెండు క్షణాలు చూశాడు.

'అల్లా......' అంటూ ఆ రక్తపుమడుగులో కూలబడి, శవంపై వాలిపొయ్యాడు దాదా. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. గట్టిగా గాలి పీల్చుకొని వదిలేశాడు. శూన్యంలోకి చూస్తూన్న తన చూపులు త్రిప్పుకొని దాదాకేసి చూశాడు.

దాదా ఏడుస్తున్నాడు చిన్న పిల్లవాడిలా.

మసీదునుండి మళ్ళీ ఒక్కసారి ఏకకంఠంతో మాటలు వినిపించాయి.

'దాదా?' పిలిచాడు.

ప్రశ్నార్థకంగా దాదా ఇటుతిరిగి చూశాడు.

"దాదా......ఖాన్‌భాయ్ హత్యకు మేమా కారణం? హిందువులు చంపారు. హైద్రాబాద్ విముక్తికోసమై ప్రాణాలు బలి చేసిన అనేకమంది ముస్లిం వీరుల్లో నీ పుత్రుడొకడు. ఖాన్‌భాయ్ ఆత్మశాంతికోసం మేము ప్రతిరోజూ ప్రార్థనలో అల్లాను వేడుకొంటున్నాం."

"ఖాన్‌కాదు.....చిట్టితల్లి......నా చిట్టితల్లిని పొట్టన బెట్టుకొంది వీళ్ళుకాదూ?...." వ్రేలుపెట్టి మసీదులోకి చూపెట్టాడు. గొంతు పూడిపోయింది.

మసీదులో అందరూ శిరస్సులు నేలపై కొంచారు.

మతగురువు ఏదో ఉర్దూలో పలికాడు.

అందరూ విధేయతతో ఆ మాటలకు మారు పలికారు. దాదా చెయ్యి దించుకొన్నాడు. చూపు మరల్చుకొన్నాడు. కన్నులలో నీరు ఉబికింది. ముఖం రెండు చేతుల్లో దాచుకొని, "నా చేతులారా నిన్ను గొంతుపిసికి చంపానుబిడ్డా......నన్ను అల్లా క్షమించడు"—అంటూ శిరస్సు నేలపై కొంచి మోకరిల్లాడు.

అతని కేమీ అర్థం కాలేదు. ఆశ్చర్యంతో దాదాకేసి చూసి "నీ కూతు రెవరు దాదా" అని అడిగాడు.

దాదా ప్రత్యుత్తర మియ్యలేదు. నేలకొంగిన శిరస్సు మెట్టపై అలానే ఉండిపోయింది. అతని ముడికి వ్రేళ్ళనుండి నీటి చారికలు కన్పిస్తున్నాయి. దాదా మూసిన కనురెప్పలవెనక భయంకర దృశ్యాలు. కళ్ళుమూసికొన్నా కనిపిస్తున్నాయి.

2

వారంరోజులు గిర్రున తిరిగిపొయ్యాయి. హైద్రాబాద్ చరిత్రలో 'ఖాన్‌భాయ్' హత్య పాతబడిపోయింది. ఈ హత్యను పురస్కరించుకొని, మతవైషమ్యాలు పరాకాష్ఠనందుకొన్నాయి. హైద్రాబాద్‌లో స్థానికంగా జరుగుతున్న అఘాయిత్యాలకన్నా గ్రామాలలో జరిగే హత్యలు, దుర్మార్గాలూ భయంకరంగా ఉన్నాయి. కొట్లాటలకు పోవటం, కత్తులు ప్రక్కలో పెట్టుకొని పడుకోవటం అందరికీ సామాన్యంగా ఆచరించే దైనందిన చర్యలైపొయ్యాయి. మునిసిపాలిటీ కారులనుచూసి, కుక్కలు భయపడి పారిపోయినట్లు, రజాకార్ జీపులనుచూసి, హిందువులు "నాంపల్లి" స్టేషనుకు పరుగెత్తుతున్నారు.

దాదా పడుకొన్నాడు.

నూనె మరకలతో నల్లగా మురికిబట్టిన ఓ పరుపుపై మేను వాల్చాడు. శిథిలమై, జీర్ణావస్థలోఉన్న అతని ఇంటిగోడలు ఉప్పిరికి పడుతున్నాయి. పైన బూజు నిశ్చింతగా వూగిన లాడుతోంది. పరుపంతా ఉప్పుమట్టి పేరుకుపోయింది. ప్రక్కన తనచేతికర్ర, నీళ్ళుత్రాగే చవుకబారు 'మగ్గు' ఉన్నాయి.

'దాదా' కళ్ళు తను పుత్రుడు చదివిన పుస్తకాల దొంతరలను పరిశీలిస్తున్నాయి. ఆ దొంతరల మధ్యనున్న తన పుత్రుని ఫోటోపై సాలీడు గూడుకట్టింది అసహ్యంగా. "బేటా....." అంటూ, అటు పొర్లాడు. కళ్ళలో నీరు ఇగిరిపోయింది.

దాదాకు పెద్ద అన్యాయం జరిగింది. తన జీవితపు నడక భ్రష్టమైపోయింది. తను విశ్వమానవ శ్రేయోభిలాషి. హిందూ ముస్లిం అనే తారతమ్యం లేకుండా అందర్నీ ప్రేమించాడు. అందరికీ తను ఉపయోగపడ్డాడు.

తను మరొకరిపట్ల అన్యాయంగా, దుర్మార్గంగా ప్రవర్తించితే, ఆ పాపానికి 'రేపు' తన కొడుకు శిక్షితుడౌతాడనే విశ్వాసంతో బ్రతుకు వెళ్ళదీశాడు. ఏం పాపంచేస్తే దేవుడు తనకి శిక్ష విధించాడో తెలియక తికమకపడ్డాడు దాదా.

ముచ్చటగా విరియబూసిన పరిమళాన్ని వెదజల్లుతుందని ఎదురుచూసిన 'మొగ్గ'ను త్రుంచివేశారు.

ఎద్దంత కొడుకు. చేతికి అక్కరకొచ్చిన కొడుకు. హిందువులు అకారణంగా చంపివేశారు. హిందువులతో స్నేహం చేస్తూ, వాళ్ళ రహస్యాలను ముస్లింలకు చేరవేస్తున్నాడన్న అనుమానంతో హత్య చేశారు.

తన పుత్రుడా కాలేజీలో విద్యార్థి సంఘానికి అధ్యక్షుడుగాఉండి, హిందూ, ముస్లింలను ఒకే జాతిగా సమైక్యపరచా

లనీ, సంఘటితపరచాలనీ శక్తివంచన లేకుండా కృషి చేశాడు. ఆ ప్రేమకు, సేవకూ ఫలితంగా తన నా విధంగా హత్య చేశారు.

ఇప్పుడా దుర్మార్గులను శిక్షించాలి.

అదే తన జీవిత పరమావధి. ఇదే తనకు మిగిలిన కర్తవ్యం.

న్యాయాన్యాయాలను పరిశీలించి, దుర్మార్గులను శిక్షించే అలౌకిక శక్తి ఒకటున్నదన్న అంధ విశ్వాసం, ఈ సంఘటనతో మట్టికొట్టుకుపోయింది.

పుత్రుని దుర్మరణం హిందూజాతిపై కక్షను, ద్వేషాన్ని పురికొల్పసాగింది.

బ్రతుకులో ఆశలన్నీ రాలిపోయి, నిరాశ నర నరాల్లో జీర్ణించుకుపోయినప్పుడు, ఆ వ్యక్తికి ప్రపంచంపట్ల, బ్రతుకు పట్ల విరక్తభావం కలుగుతుంది. ఆ భావం కొందరిని ఆత్మ హత్యకు పురికొల్పుతుంది. కొందరిలో ఆ పరిణామం తనకా బ్రతుకు కల్పించిన వారిపై పగ సాధించటానికి కావలసిన మూర్ఖత్వాన్ని, అమానుషత్వాన్ని ప్రసాదిస్తుంది.

బుసలుకొట్టే ఆ పాశవిక ప్రవృత్తులనుండి మానవునికి విముక్తి కలిగించాలంటే, అతని హృదయంలో అణగారిపోయిన ప్రేమ, ఆత్మీయత మొదలయిన సునిశిత ప్రవృత్తులను జాగృతంచేసే బలీయమైన ప్రభావం ఉండాలి.

'హిందు' అన్నమాట తలపుకొస్తే 'దాదా' ఒళ్ళు కంపర మెత్తుతూంది. ముసలివాడయినా, అతని రక్తం వేడెక్కింది. దాదా పిడికిలి బిగించాడు. నరాలుఉబ్బి, ఎర్రటి శరీరంలో నల్లటి చారలుగా కన్పించాయి. ఏదో సమస్య పరిష్కారమై నట్టు 'దాదా' లేచాడు.

కూజాలో నీళ్ళు ఆ మురికి 'మగ్గు'లో పోసికొని, కళ్ళు పైకెత్తుకొని, గోడకేసి చూస్తూ 'గుటగుట' త్రాగాడు మొరటుగా.

పుత్రునిఫోటోపై సాలీడు ప్రాకుతోంది. నీళ్ళు చింది, గడ్డంపైనుండి జారి మురికి షేర్వాణి తడిసిపోయింది.

ఎర్రబారిన అతని కళ్ళు తీక్షణమైన చూపులు ప్రసరింప చేశాయి. "కాఫర్" అంటూ సాలీడును క్రింద పడవేసి, కాళ్ళ కింద నలిపివేశాడు. ఫోటోపైనున్న సాలెగూడు, షేర్వాణితో తుడిచాడు.

గడియవేసిఉన్న తలుపు సందునుండి, ఉత్తరం ఒకటి లోపల పడింది.

దాదా గడియ తీశాడు.

'పోస్ట్‌మాన్' సైకిల్‌పై పోతున్నాడు.

వారం రోజులనుండి వెలుగుచూడ నోచుకోని ఆ ఇంటి గోడలు ప్రశాంతంగా వెలిగాయి. ఆ వెలుగులో దాదా సులోచ నాల కోసమై వెదకాడు. సులోచనాలు గోడమీద ఉన్నాయి. దానికి ఒకవైపు తీగె ఉంది. మరొకవైపు దారం వ్రేలాడు తోంది. కళ్ళద్దాలు ముక్కుపై పెట్టుకొని ఆ దారం చెవికి చుట్టుకొన్నాడు.

ఉర్దూలో వ్రాసిఉంది.

ఉత్తరం చేతి వ్రేళ్ళమధ్య గజగజ వణికింది. అతను గోడకు చేరగిలా పడ్డాడు ఒక్కక్షణం. మళ్ళీ లేచాడు. బయటికి వెళ్ళాడు. రెండు మూడుసార్లు అటూ, ఇటూ తిరిగాడు. మేధస్సులో చీకట్లు క్రమ్మితే, మనస్సు ఆలోచించటానికి నిరాకరిస్తే, మానవ హృదయం అలా కొట్టుకొంటూంది, తెగిపోయిన బల్లితోకలా.

కళ్ళద్దాలముందు మళ్ళీ ఉత్తరం పెట్టాడు.

అక్షరాలు—కన్నీటిబొట్లుపడి చెరిగిపోయిన అక్షరాలు—రక్తాక్షరాలు.

అతని పెదవులు కదిలాయి.

'అల్లా' అంటూ తలగోడకేసి కొట్టుకున్నాడు.

తలుపు గడియపెట్టకుండా బజార్లో పడ్డాడు. శివం పూనినవాడిలా పెద్ద పెద్దఅంగలువేసికొంటూ రోడ్డుపైన నడవసాగాడు. ముసలి 'దాదా' వీరులా ముందుకుపోతోంటే, అతని శ్రేయోభిలాషులు, పరిచితులు ఆశ్చర్యంతో నోరు తెరచు కొని చూడసాగారు.

వేగంగా నడవటంమూలంగా, అతనికాలు మడతబడింది. తగిలిన కాలుకే మళ్ళీ ఎదురుదెబ్బ తగిలింది.

దక్కన్ శిల్పకళా నైపుణ్యంతో ప్రాచీనంగా కన్పిస్తూన్న భవనమ్ముందాగిపొయ్యాడు. దాదా ప్రహరీగేటు నెట్టాడు. తాళం వేసిఉంది.

ఇల్లాంతా నిర్మానుష్యంగా బోసికొడ్తోంది. పాడుబడిన దయ్యాలకొంపలా చండభానుని కాంతిలో కాగిపోతోంది.

దాదా చువ్వలమధ్య ఇరికించిన ముహాన్ని వెనక్కి తీసి కొన్నాడు.

'మోతీ' అని పిలిచాడు.

సీమ కుక్కపిల్ల ఆ ఇంటినుండి పరుగెత్తింది. సందులో నుండి దూరి ఈవలకొచ్చి 'దాదా'ను స్పృశించింది. మొర ఎత్తి పెద్దగా ఏడవసాగింది. దాన్ని ఒళ్లోకి తీసికొని ప్రేమతో దాని తలని నిమిరాడు.

కుక్కపిల్లవచ్చిన రెండు నిముషాలకు ఆ బంగళా వరం డాలో ఒక యువతి ప్రత్యక్షమైంది. దొంగలా తొంగిచూసి కొంటూ, మునిగాళ్ళమీద నడుచుకొంటూవచ్చి స్థంభంచాటున దాక్కుని రోడ్డుపైనున్న వ్యక్తిని పరిశీలనగా చూసింది.

సన్నగా ఎర్రగాఉంది. వేసవి గాలులకు వాడి వాలిపోయిన లేత రెమ్మలా నీరసంగాఉంది. ఆ పిల్లకనులు భీతిని వ్యక్త పరుస్తూ, కాంతిగోళాల్లా ఉన్నాయి. కనురెప్పలు వాచిపొయ్యాయి. చిందర వందరగాఉన్న జుత్తు చిరుగాలి తాకిడి క్కాడ భయపడి అల్లల్లాడుతోంది.

గేటువద్దఉన్న 'దాదా'ను భయంతో, సందేహంతో ఒక త్రుటికాలం పరిశీలించింది. చెక్కిళ్ళవెంట అశ్రువులు రాలి పొయ్యాయి. దాదా అంటూ బావురుమని ఏడ్చింది. వణుకుతున్న కాళ్ళతోవచ్చి గేటు తీసింది.

ప్రేమతో ఆపిల్లతల నిమురుతూ, ఓదార్చాడు దాదా. 'భయపడకు తల్లీ....నే నొచ్చానుకదా!.....లోనికి వెళ్దాం—పద'' అని బయట నిలబడితే సంభవించే ప్రమాదాన్ని సూచించాడు.

కుక్కపిల్ల, ఆ అమ్మాయి లోనికి నడిచారు.

రోడ్డు చివరలు రెండూ నిశితంగా పరిశీలించి గేటు మూశాడు.

మధ్యహాలులోఉన్న అద్దాల బీరువాలు, విలువైన వస్తువులూ అన్నీ సహస్రధా ముక్కలై, చెల్లాచెదరై క్రిందపడి పొయ్యాయి. నడవాలంటే గాజు పెంకులన్నీ జాగ్రత్తగా పరిశీలించి అడుగువెయ్యాలి. కర్ర సామానంతా అటు, ఇటు విసిరి వెయ్యబడి, అంతా చిందర వందరగా ఉంది.

''ఎలా పారిపోదాం మనం?'

ఆ అమ్మాయి ప్రశ్నించింది.

'ఇప్పుడే పోదాం......తల్లీ.....మరి అమ్మ విషయం ?

'అమ్మను—అమ్మను—వాళ్ళు రాత్రి లాక్కెళ్ళారు—దాదా'–గుడ్డ నోట్లో పెట్టుకొని, చిన్నస్వరంలోచెప్పింది ఏడుస్తూ.

''ఎప్పుడు?''

''నీ వుంటే ఈ ఘోరం జరిగేది కాదు దాదా. ఎలానో తప్పించుకొనేవాళ్ళం''....ఆ రోజున నీవు వెళ్ళినరాత్రి మన ఇంటిని రజాకార్‌లు ముట్టడించారు. మన ప్రహరీచుట్టూ తుపాకులూ, కత్తులూ పట్టుకొని కొందరు 'పహరా' తిరుగుతూంటే, కొందరు మన ఇంట్లో ప్రవేశించారు. అమ్మ నన్ను 'మైలగుడ్డల' పెట్టెలో దాచింది. వాళ్లు ఇంట్లో ప్రవేశించి నగలూ, డబ్బూ అన్నీ దోచుకొని ఈవిధంగా భీభత్సం చేశారు......నాన్నను ఎక్కడ దాచావో చెప్పమని హింసించారు దాదా అమ్మను......ఒకడు 'రోగ్' అమ్మను గుండెల్లో తన్నాడు......నేను చూడలేక కళ్ళు మూసుకున్నాను దాదా.''

పెల్లుబికి వస్తూన్న దుఃఖాన్ని ఆపుకోలేక పెద్దగా ఏడ్చి దాదాను కౌగలించుకొంది.

దాదా పెదవులు కరచి పట్టుకొన్నాడు. ముక్కు కంది నట్లు ఎర్రబారింది. ఆయాసమొచ్చి దాదా నేలపై చతికిల బడ్డాడు.

'దుర్మార్గులు......ముక్కలు ముక్కలుగా నరికేవాణ్ణి..... ఇంకేం చేశారు?''

''ఇంకేముంది దాదా-అమ్మ క్రిందపడిపోయి, రెండు చేతులెత్తి దణ్ణంపెట్టినా, ప్రణమిల్లినా, వదలిపెట్టలేదు. ఇక ఆ బాధ భరించలేక రెండు రోజుల్లో వస్తారు...... పట్టిస్తానని ప్రమాణం చేసింది......రాత్రివరకూ మన ఇంటిపై నిగా వేశారు. రాత్రి పన్నెండు గంటలకు అమ్మను......అమ్మను..... ఈడ్చుకెళ్ళారు దాదా......

''పెద్దగా ఏడవకు తల్లీ—ఆ దుర్మార్గులు మనల్ని పసి కట్టారు.''

రెండుక్షణాలు భయంకరమైన ప్రశాంతత ఆవహించింది. ఆ అమ్మాయి 'ఎక్కిళ్ళు' మినహా మరే సవ్వడీలేదు. ఎర్రగా వాచిన కనురెప్పలు తుడుచుకొని దాదాను పిలిచింది.

''దాదా!......అమ్మ నాకికలేదా?''

''క్రూరమృగాల నోటిలోబడినవాళ్ళు తిరిగివస్తారా అమ్మా...ఈ ముసలి దాదాయే నీకు అమ్మా......న్నాన్నా.''

'దాదా!'

'అమ్మా!'

దాదా ముసలి చేతులు ఆ పిల్లతలను నిమిరాయి. తన మురికి షేర్వాణితో ఆ అమ్మాయి కళ్ళు తుడిచాడు. ఆ అమ్మాయి శిలాప్రతిమలా కూర్చొని సుదీర్ఘంగా ఒక్క నిముషం ఆలోచించింది.

''దాదా......ఎన్నో సంవత్సరాలుగా ఈ గడ్డపై బ్రతికాం.. ఇప్పుడు మీరు వెళ్ళిపొమ్మంటే ఎక్కడికి పోవాలి. ఇళ్ళూ, వాకిళ్ళు వదులుకొని......ఈ హైద్రాబాద్ మీద దనటానికి మీకు హక్కేముంది. మీరు అరబ్బు దేశంనుండి, పర్షియానుండి వలస వచ్చినవాళ్ళేకానీ, మీకు మాత్రం ''జన్మ హక్కెక్కడిది''—పశువులు'' అంది.

దాదా కన్నుల్లో జ్వాలలు రేగాయి. ఒక నిశితమైన చూపు విసిరాడు.

''ఆ అమ్మాయిలో హిందూ రక్తం ప్రవహిస్తోంది. ప్రతి అణువూ హిందూజాతికి చెందింది.''

మానినపుండు పధ్యంలో వ్యత్యాసం రాగానే సచ్చిరేగి నట్లు మళ్ళీ హిందూజాతిపైన అసహ్యం, ద్వేషం పుట్టుకొచ్చాయి. ఆ ద్వేషమ్ముందు, ఆత్మీయత, ప్రేమ, ప్రవృత్తులు గ్రహణం పట్టినట్లు మరుగున పడిపొయ్యాయి. తెల్లనిబట్టపై నెత్తురుమరకలా కక్ష మదిలో మెరసింది. కోపం వెల్లువలా ముంచెత్తింది. కోపంతో ఆ అమ్మాయిని ప్రక్కకు నెట్టాడు. తల నేల కొట్టుకుంది.

''మేముకాదు పశువులం—మీరు, మీ హిందూజాతి—మిమ్మల్ని ఏంజేసినా పాపంలేదు......అన్యాయంగా వా కొడుకుని చంపారు......మీరు పశువులు.''

అప్రతిభురాలైపోయింది.

''దాదా? ఖాన్‌భాయ్‌ని హత్యచేశారా?'' వ్యాకులత ఆ కంఠంలో స్పష్టంగా గోచరించింది. లేచి నివ్వెరపాటుతో దాదాను చూడసాగింది.

''మీరే చేశారు?'' ముహంపై స్వేదజలం కారుతూంటే వ్రేలు తనకేసి చూపెడుతూ గర్జించాడు.

ఈ అసత్య అభియోగానికి ఆ అమ్మాయి చెవులు మూసికొంది. శివం పూనినట్లు మీదకొస్తూన్న అతన్నిచూసి ఒక్కడుగు వెనక్కివేసింది.

''దాదా......నాకు తెలియదు—నిజం దాదా''

"నీకు తెలియదూ......మీ హిందువులు చంపారు...... పశువులు......పృధ్వికి చీడపురుగులు....అధములని, అస్పృశ్యులని, భూసురులని, భూపతులని, మానవులను విడదీసి అది "పూర్వజన్మ ఫల"మని సమర్థించే మీ మతాన్ని, జాతినీ సమూలంగా నాశనం చెయ్యాలి—వ్యక్తికీ, వక్తికీ మధ్య కులాలపేరుతో అందుకోరాని అంతస్థులు సృజించిన దుర్మార్గులు మీరు—సోదర భావం, సమానత్వంఅంటే తెలియని మూర్ఖులు—మిమ్మలను నాశనం చెయ్యాలి. అప్పుడే నాకు శాంతి.....నిన్ను చంపేస్తా...." సంధిక్రమ్మిన రోగిలా పేలిపొయ్యాడు.

"నన్నెందుకు చంపుతావ్" నిశ్చలంగా అడిగింది తడబాటు లేకుండా.

ఆ అమ్మాయిలో ప్రస్ఫుటితమయ్యే గంభీరతచూసి, దాదా అడుగు ముందుకు వెయ్యలేదు.

'నీవు శత్రువ్వు కనుక'

'నేనా?'

'అవును నీవే'

'మనకున్న శతృత్వ మేమిటి దాదా?'

'నీవు హిందూవి—నేను ముస్లింని......యుగ యుగాలుగా వస్తోంది ఈ శతృత్వం"

"హిందూజాతిలో జన్మించటం నా స్వయంకృతాపరాధమా? అయితే ముస్లిం జాతిలో నీవుకోరి జన్మెత్తావా?"

దాదా రెండు చేతులూ పైకెత్తి ఒక కాలుముందుకేసి చిత్తరువులా ఉండిపొయ్యాడు. లోనికి పీక్కుపోయిన కళ్ళు నిర్జీవంగా, భావరహితంగా ఉండిపొయ్యాయి. చూపులు క్రిందకు దించుకొన్నాడు. అటు తిరిగి ఏదో సమాధానం చెప్పబొయ్యాడు. మాటలు పెదవులుదాటి రాలేదు. చదువూ, సంస్కారం ఆ అమ్మాయి కళ్ళలో ప్రతిఫలిస్తున్నాయి.

"దాదా?" కటువుగా పిలిచింది.

వెనక్కి తిరిగాడు. "మానవులు విధాత సృష్టిలో అందరూ సమానులే. ఈ జగత్తుపై వేళ్ళుపాతుకుపోయి, వెర్రితలలు వేసిన ఈ జాతులు, మతాలు, మానవుల్ని వేరు చేస్తున్నాయి. అనాగరికయుగాలలో స్వప్రయోజనాలకోసమై స్వార్థపరులు సృజించిన ఈ బంధనాలు ఛేదించుకొని, మానవ సౌభ్రాతృత్వం సాధించే భావ వికాసం మనలోలేదు. బ్రహ్మజెముడులా విస్తరించిన ఈ నాగరికతారణ్యంలో వికృతంగా విరిసిన ఈ శాస్త్ర విజ్ఞానం ప్రసాదించిన తుపాకులూ, ఫిరంగులూ తీసికొని తిరుగుతున్నారు పశువులు............మీరు హిందువులను వేటాడుతారు....... హిందూవులు ముస్లింలను హత్య చేస్తారు. ఈ రక్తవాహినితో వీళ్ళు సాధించబొయ్యే మహత్కార్య మేమిటి?"

అన్నిటికీ తెగించిన ఖైదీలా అనర్గళంగా మాటాడింది స్వచ్ఛమైన ఉర్దూలో.

ఆ మాటలు దాదాపై కొంత ప్రభావం చూపెట్టాయి. ఆ అమ్మాయిపట్ల కల్గిన అసహ్యం, ద్వేషం మంచులా నీరు కారిపోసాగింది. కానీ పుత్రుని దుర్మరణం జ్ఞప్తికొచ్చింది.

హిందువులు హత్య చేశారు తన కొడుకుని—ఆ కోవకు చెందిందే తను—

"మాటలతో నన్ను మోసం చేద్దామనుకొంటున్నావా? అదేం కుదరదు......నిన్ను గొంతుపిసికి"......అంటూ ముందుకు కదిలాడు.

ఆ పిల్ల భయపడి పరుగెత్తలేదు. ఆ ముసలివాడి చర్యను ప్రతిఘటించలేదు. అతని దురాగతాన్ని అనుకూలిస్తూ, మెడను వెనుకకు వాల్చింది.

దాదా ఆగిపొయ్యాడు అదే భంగిమలో.

"ఆగిపొయ్యావేం దాదా! చంపు......నాలాటి వాళ్ళను పదిమందిని హత్య చెయ్యి. ఈ పుణ్యానికీ హిందువులపట్ల నీవు చూపిన ప్రతీకారానికీ 'అల్లా' మెచ్చుకొని నీకు ఖాన్ భాయ్‌ని తిరిగి ప్రసాదిస్తాడు."

"ఖాన్ భాయ్......భాయ్......"అంటూ గొణుక్కున్నాడు. తీవ్రమైన భావసంచలనం కల్గింది. గ్రహణంపట్టి వదలినట్లు. కక్ష, ప్రతీకారభావం అతన్ని వీడిపొయ్యాయి. పవిత్రమైన ప్రేమతో అతని హృదయం ప్రకాశించింది. తన కాఠిన్యతకు మనస్సు క్షోభ చెందింది.

"బేటీ'......ఆ పిల్లను తన చేతుల్లోకి తీసికోటానికై చేతులు చాచాడు, కళ్ళవెంట నీళ్ళు జలజలరాలుతూంటే.....

హఠాత్తుగా సంభవించిన ఈ హృదయ పరివర్తనను ఆ అమ్మాయి గుర్తించలేదు. ఏవగింపుతో 'దాదా' చేతులను తోసి వేసింది.

'దాదా! నిన్ను ఒక్క టడగాలనుకొంటున్నాను......నిజం చెబుతావా?"

న్యాయవాదిముందు నేరస్థునిలా భయపడుతూ నిలబడ్డాడు. విధేయతతో, కనురెప్పలు పైకెత్తాడు.

'నాల్గురోజులనుండి మా ఇంట్లో జరిగిన ఈ అత్యాచారాలను నీవు పరోక్షంగా ప్రోత్సహించావ్‌కదూ?....ద్రోహి..... నీ యావజ్జీవితం మా సేవలో గడిపావ్—నీ చేతులతో నన్ను పెంచావ్. నీ చేతులతోనే మమ్మలను నాశనం చేస్తున్నావ్ కదూ?.......నన్ను చంపటానికి నీకు చేతులెలా వస్తున్నాయి?

దాదాకు వీపు జలదరించింది. ఎవరో వీపు చరిచినట్లు, జుట్టుబట్టి లాగినట్లు, నవ్వినట్లు వింత వింత ధ్వనులు వినవస్తున్నాయి. చుట్టూ తిరిగిచూసికొన్నాడు. పగిలిపోయిన అద్దాలు పళ్ళికిలించాయి.

"బేటీ......నేనా!......నేనా?" అన్నాడు గొంతు పిసికినపుడు వెలువడుతున్నట్టు మాటల్లా......

వీధిలో అల్లరి వినిపించింది.

కిటికీవద్ద పరదాతీసి తొంగిచూశాడు.

జీప్ ఒకటి రోడ్డుపై ఆగింది. తుపాకులూ, కత్తులూ పట్టుకొన్న 'రజాకార్'లు పట్టపగలే హత్య చెయ్యటానికి సన్నద్ధులై కారు దిగారు.

ఆ పిల్ల శరీరం మంచులా బిగుసుకుపోయింది. సర్వాంగాలు మొద్దుబారిపొయ్యాయి. నిర్జీవంగా నిలబడి 'దాదా' కేసి చూసింది. అస్తమయానికిముందు వెలిగే సూర్యకాంతిలా ఆ పిల్ల పెదవులపై చిరునవ్వు గోచరించింది.

"ఈ దిక్కులేనిదాన్ని చంపటానికి ఇంతమంది ధీరులు తుపాకులతో, కత్తులతో రావాలా!......దాదా......నన్ను హింసించి పరాభవించి నరికిపారేస్తే మీకు కలిగే ప్రయోజనమేముంది..... చంపటం మీ లక్ష్యం.....అదిగో ఆ కర్ర తీసికొని నా తలమీద కొట్టు......ఒక హిందూని చంపానన్న ఆత్మసంతృప్తి నీకు చిరకాలముపుండిపోతుంది......త్వరగా దాదా"......తూలి క్రింద పడిపోయింది.

దాదా శరీరం కంపరమెత్తింది. కిటికీనుండి చూశాడు.

గేటుతాళంలాగిచూసి ఒకడు గేటు దూకాడు.

దాదా కళ్ళు తుడుచుకొని, షేర్వాణి సవరించుకొని బయటికి వెళ్ళాడు.

'ఆదా భరజే' అంటూ అందరికీ వంగి సలాముకొట్టాడు.

"ఏమిటి? వాడి ఆచూకీ ఏమైనా తెలిసిందా?" ఆ ఖరీదైన షేర్వాణి, ఎర్రని కుచ్చుటోపీ పెట్టుకొని ప్రశ్నించాడు.

"తెలిస్తే వాణ్ణి ప్రాణాలతో వదలిపెట్తానా?...... నేను మాత్రం ముస్లింని కానూ?"

"ఈ ముసలివాణ్ణిచూసి మన యువకులు ఎన్నో విషయాలు తెలిసికోవాలి". చిరునవ్వు నవ్వటానికై ఆ ఖరీదైన షేర్వాణి, పెదవిని ఒక ప్రక్కకు లాగాడు పక్షవాతం వచ్చిన వాడిలా. కారు స్టార్ట్ చేశారు.

"ఈ ఇంట్లో ఇప్పు డెవరున్నారు?". ఒకడు ప్రశ్నించాడ..

కారు కదిలింది, వెనక్కి తిరుగుతూ.

"ఎవరూలేరు......నేనొక్కడ్నే......"

"రెండోగొంతు వినిపించిందే?"

"అవును......ఆమె నా కూతురు......"

కారు వేగంగా దూసుకుపోయింది.

దాదా అందరికీవంగి సలాములు కొట్టాడు. కారు దృష్టిపథంనుండి దూరమయ్యేవరకూ కోరచూపు చూశాడు. గేటు తాళంవేసి ఇంట్లోకి పరుగెత్తాడు.

దాదా గుండెల్లో సన్నగా బాధ దూసుకుపోయింది. నిలబడలేకపొయ్యాడు. కనుకొలకులనుండి నీరు గిర్రున తిరిగి 'షేర్వాణి'పై పడింది.

ఆ అమ్మాయి మోహాన్ని రెండు చేతులతోనూ పొదవి పట్టుకొని, "నీవు కూడ నన్ను—దిక్కులేనివాణ్ణి చేశావామ్మా.... అమ్మా" అంటూ బావురుమన్నాడు.

అట ఇటూ పడిఉన్న చేతులు సరిచెయ్యటానికి దాదా చేతులు స్పృశించాడు. నాడి నీరసంగా కొట్టుకొంటోంది. పెదవులు చప్పరించసాగింది.

మూడు రోజులనుండి నిక్కచ్చుప్రతుకు వెళ్ళదీసిన ఆ అమ్మాయి దుస్థితి అవగాహన చేసికొన్నాడు. నీళ్ళు తెచ్చి మొహంపై చల్లి, తడిగుడ్డతో ముఖాన్ని తుడిచాడు.

ఆ అమ్మాయికి స్పృహ కల్గింది. కళ్ళు తెరచిచూసింది భయంగా పిచ్చి పిచ్చిగా.

"ఆ దుర్మార్గులు వెళ్ళిపొయ్యారమ్మా......లే, మనం త్వరగా వెళ్ళకపోతే మన జీవితాలకు ఇదే చివరిరోజు" బ్రతిమాలుతున్నట్టు జాలిగా అడిగాడు.

లేచి కూర్చొని 'దాదా'ను పరీక్షగా చూసింది. అతని వింత ధోరణి ఏమీ అర్థంకాలేదు. ఏదో మాట్లాడబోయింది. కానీ,

"త్వరగా పారిపోవాలి లేమ్మా". దాదా కంఠంలో భయం.

మురికిగాఉన్న తెల్ల దుప్పటితెచ్చి, ముస్లింస్త్రీ బురఖా తగిలించుకొన్నట్లు కళ్ళు కన్పడేలా ఆపాదమస్తకం కప్పాడు. ఒక్కసారి రోడ్డుపైకి వెళ్ళి అంతా నిశితంగా పరిశీలించి వరండాలోకి వచ్చాడు. భయ సందేహాలతో మరొకసారి వెనుతిరిగి చూశాడు. తలుపుతీసి "బయటికి రా మ్మా...... రిక్షాలేమీ కన్పించలే"దన్నాడు.

మూగగా అనుసరించింది 'దాదా'ను.

కుక్కపిల్ల తనను అనుసరించింది.

దాదా యాంత్రికంగా పెద్ద పెద్ద అంగలు వేసికొంటూ, ఏమో మాట్లాడుతూ నడుస్తున్నాడు.

ఇల్లుదాటి పదిగజాలు దాటారు.

ఆ అమ్మాయి కాళ్ళు నీరసించిపోసాగాయి. దాహం వేయసాగింది.

"దాదా!"

"అమ్మా!"

"నాకు కళ్ళు తిరుగుతున్నాయి"—తల పట్టుకొని పాదచారులు నడిచే బాటపై కూర్చుంది.

దాదాలో భయం ఉధృతమైంది. ఐదు నిముషాలు గడిచాయి. ఒక రిక్షా దొరికింది. ఆ అమ్మాయిని రిక్షాలో కూర్చోబెట్టి, 'దాదా' కుక్కపిల్లను చేతబట్టుకొని, రిక్షా ఎక్కాడు.

'రిక్షా' ముందుకుసాగింది.

జీప్ ఒకటి ఎదురై దూసుకుపోయింది. తుపాకులు పట్టిన రజాకార్లు.

దాదా వెనుతిరిగి చూశాడు.

"జీప్' బంగళాముందాగింది. ఆ ఖరీదైన షేర్వాణి ఆజ్ఞతో అందరూ గోడదూకి లోపలికి పరుగెత్తారు.

"అమ్మో" అన్నాయి, దాదా పెదవులు.

దాదా భుజంపై నిర్జీవంగా వ్రాలిన ఆ అమ్మాయి తృళ్ళిపడింది.

3

రిక్షాదిగి దాదా మురికికూపంలో ప్రవేశించారు ఇద్దరూ. వెంటనే గడియపెట్టాడు. ఆ పిల్ల దాదా మురికి పరుపుపై కాళ్ళు ముడుచుకొని పడుకొంది. దాదా 'వేడ్నీళ్ళు' పొంగించి 'చా' చేశాడు. 'నికిల్' కోటింగు రాలిపోతున్న పాత 'మగ్గు'లో పోసి ఆ అమ్మాయికి త్రాగించాడు.

కొన్ని 'కుక్కపిల్ల'కు పోశాడు.

తోక ఊపుకొంటూ సంతోషం వెలిబుస్తూ, గతి కింది కుక్కపిల్ల. ఆ అమ్మాయి 'చా' త్రాగుతోంటే గడియ తీసికొని బయటికివెళ్ళాడు. వెడుతూ, వెడుతూ బయట తాళం వేసికొని వెళ్ళాడు దాదా.

ఆ అమ్మాయి గుండె లాగిపోయినంత పనయింది. కేక పెట్టి పిలుద్దామంటే దయ్యంపట్టినట్లు పెదవులవెంట మాట బయటికి రాలేదు. ప్రాణా లరచేత బట్టుకొని ద్వారం కేసి చూస్తూ కూర్చుంది.

పదిహేను నిముషాలు గడిచి పొయ్యాయి.

తలుపు తీశాడు దాదా. దాదా చేతుల్లో పునుగులు, ఇంకా శనగపిండితో తయారు చెయ్యబడ్డ పదార్థాలు ఏవో ఉన్నాయి. అవన్నీ పళ్లెంలో కుమ్మరించి తినమన్నాడు దాదా.

"వద్దు—దాదా—నాకు ఆకలివెయ్యటంలేదు. ఎందుకింత శ్రమ" అంది.

"వాడు కూడా ఇంతే......రాక రాక ఎప్పుడన్నా ఇస్కోలు నుండి ఇంటికొస్తే ఏమీ తినడు......" దాదా చిరాకుపడ్డాడు.

కిమ్మనక సగం పళ్లెం ఖాళీచేసి, "ఇక చాలుదాదా" అంది నీళ్ళు త్రాగుతూ. మిగతావి దాదా, కుక్కపిల్ల పంచుకొన్నారు. దాదా 'టీ' వేడిచేసికొని త్రాగసాగాడు. ఆ అమ్మాయి దాదా ఇంటిని పరిశీలనగా చూడనారంభించింది.

మురికి షేర్వాణీలు, బూజుపట్టిన పుస్తకాలు, ఉప్పి రికిపడుతున్న గోడలు—మట్టికంపు కొడుతున్నాయి. చందమామ, నక్షత్రం ఉన్న మసీదుఫొటోకు ఆరిపోయిన అగరువత్తులు వ్రేలాడుతున్నాయి. ఆ గదిలో చిల్లులుపడ్డ గోనె పట్టా వ్రేలాడ కట్టిఉంది. దానికి ఆవలిది వంట గది—ఘోషాగది.

దూరాన రైలు కూసింది.

చూపులు క్రిందకు దించుకుంది.

దాదా మగ్గులో ఉన్న టీ మొత్తం ఖాళీచేసి, ఆమెకేసి చూశాడు.

మూర్తీభవించిన నిరాశ, నిస్పృహలా అచేతనంగా కూర్చొని, కళ్ళప్పగించి చూస్తోంది. ఆమెలో వీస్తూన్న తుఫాను ఆ కళ్ళలో స్పష్టంగా ప్రతిబింబిస్తూంది.

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావ్."

రైలు కూత మళ్ళీ వినిపించింది.

"నేను విజయవాడ వెళ్తాను దాదా......చుట్టూరా ముస్లింలున్న ఈ వాతావరణంలో ఉండటం మరీ ప్రమాద కరం......త్వరగా బయల్దేరు......ఈ గాజు లమ్మి వస్తా"

దాదా హృదయం గతుక్కుమంది. కడుపులో చెయ్యి పెట్టి కెలికినట్లుంది. అప్తులు, ఆత్మీయులు తన జీవితపథం నుండి ఒక్కొక్కరే తప్పుకొంటున్నారు. ఆ ముసలిహృదయంలో మెలి తిరుగుతూన్న వ్యథలు ఏడు దశాబ్దాల అనుభవాలను ధృవపరిచే తన నుదిటిపైనున్న ముడుతలు స్పష్టంగా కన్పించు తున్నాయి.

గాజులుతీసి దాదా చేతిల్లో పెట్టింది.

దాదా వాటిని ఆ చాపపైబెట్టాడు. లోనికివెళ్ళి తన అల్యూమినియం పాత్ర ఒకటి బయటికి తెచ్చాడు. దాదా చెయ్యి దానిలో దూర్చగానే రెండు చిమటలు, ఒక సాలీడు దాదా శరీరంపైకి ప్రాకాయి. ఒక ఎర్రగుడ్డపేలికతోకట్టిన మూట నొకదాన్ని బయటికితీశాడు. దానిలో ముస్లింస్త్రీలు చెవులకు కుట్టించుకునే జూకాలున్నాయి. ఇంకా రెండుమూడు మెట్టె లున్నాయి.

ఆ అమ్మాయి విస్తుబోతూ చూస్తూ కూర్చుంది, అతని విపరీతపు చేష్టలన్నిటిని.

వాటన్నిటినీ, ఆ గాజులతో కలిపి ఓ మూట కట్టాడు. పై భాగంవిరిగిన మరొకపాత్ర తెచ్చి బోర్లించాడు. రూపాయి నోట్ల పొత్తాం, నాల్గు వెండి రూపాయిల బిళ్ళలు ఇంకా కొంత చిల్లర పడింది. నోట్లు నల్లగా మాసిపోయి అసహ్యంగా ఉన్నాయి.

"అమ్మా! వీటిని నీ చీరె చెరుగుకు కట్టుకో" అన్నాడు.

పుచ్చుబట్టిన ఓ జాజిచెక్కలపెట్టె తెరచి, చివికి పోయిన రెండు పాత చీరెలు, ముస్లిం స్త్రీలు కప్పుకొనే ఘోషా బురఖాలు తీశాడు. అవి నల్లటి సిల్కు బురఖాలు.

"ఇవి కట్టుకోమ్మా. వీటిని విజయవాడ వెళ్లేవరకూ తియ్యకూడదమ్మా......తెలిసిందా."

ఆ నగలు, మరొక పాత చీరెలో బంధించి, దాన్ని మరో చీరెలో బంధించి, మూట కట్టాడు. బయటికెళ్ళి రిక్షా నొక దాన్ని పిలిచాడు. ఆ అమ్మాయి రిక్షాలో కూర్చుంది. పరదావేసి దాదా లోనికి వెళ్ళాడు.

రెండు మూడు నిముషాలు గడిచిపొయ్యాయి.

దాదా బయటికి రాలేదు.

"ఏం చేస్తున్నావ్ దాదా" అంటూ రిక్షాదిగి లోపలికి వెళ్ళింది.

దాదా ఖర్జూరపుముద్ద నొకదానిని నీళ్ళతో తడపుతూ, ఒక తువ్వాలులో మూట గడ్తున్నాడు.

"ఏమిటి దాదా?"

"త్రోవలో ఆకలి వేస్తే ఎలావమ్మా" అంటూ తల పైకెత్తి చూశాడు.

దాదా చెంపలనుండి కన్నీరు జారుతోంది.

దాదాను ఆపాదమస్తకం పరిశీలనగా చూసింది. శిలా ప్రతిమలా ఒకే భంగిమలో ఉండిపోయింది.

"దాదా! నేను వెళ్ళను...." మూట విసిరింది చాపపైకి.

రిక్షావాడు బయట కేకబెట్టాడు.

రైలుకూత మళ్ళీ వినిపించింది.

దాదా నోరు తెరచుకొని విస్తుబోతూ చూడసాగాడు, ఒక చేత్తో మూట పట్టుకొని.

హైద్రాబాద్ నగరాన్ని విడిచిపోవాలనుకొన్న రైలు తొందరపడుతూ మళ్ళీ కూసింది.

ఆ అమ్మాయి రిక్షాలో కూర్చుంది.

దాదా బయటికొచ్చి, పరికించి చూశాడు. సూర్యుడు అస్తమించబోతున్నాడు. నెత్తురు ముద్దలా, గీకినపుండులా, కమిలి, కుళ్ళిపోయినపండులా అసహ్యంగా ఉన్నాడు. చిత్రకారుని గీతల్లా, భవనాలన్నీ నల్లగా మేఘాచ్ఛాదితమైపొయ్యాయి.

పరదా వెనుక ఆ అమ్మాయి బురఖా తగిలించుకొని కూర్చుంది. క్రిందిభాగంపై దాదా కూర్చున్నాడు. చీకటిలా ఆలోచనలు చుట్టుకోసాగాయి వాళ్ళను.

కుక్కపిల్ల దొంగ కార్చుకొంటూ, నాలుక చాచుకొని రిక్షావెంట పరుగెత్తసాగింది. ఆ విషయం ఎవరూ గ్రహించ లేదు.

రిక్షా దిగమని 'హుకుం' జారీ చేశాడు రిక్షావాడు.

దాదా ఈ లోకంలో పడ్డాడు. "అరే! స్టేషన్ వచ్చేసింది......దిగమ్మా" అన్నాడు.

దాదా వెళ్ళి ఒక టిక్కెట్టు విజయవాడకు కొని తెచ్చాడు. రైలుబండి ప్లాట్‌ఫారం వదిలిపెట్టటానికి తయారుగాఉంది. చేపలన్నిటినీపట్టి ఒక మురుగుగుంటలోవేసి, జీవన్మరణ సంధ్యలో ఉంచినట్లు అందరూ క్రిక్కిరిసిపొయ్యారు. నిశ్శబ్దం—మరణం లాటి నిశబ్దం ఆవహించుకొంది. డబ్బాలలో అమర్చిన పంకాలు నిర్విరామంగా తిరుగుతున్న అలికిడి, కూలీల కేకలు, మినహా వేరే శబ్దంలేదు. అందరి గుండెలూ భయాన్ని పిండేస్తున్నాయి. అందరూ గార్డు 'విజిల్' కోసం, పచ్చని దీపపుకాంతులకోసం నిరీక్షిస్తున్నారు.

ఎలానో ఖాళీ చేసికొని కిటికీచెంత నిలబడింది.

దాదా మూట అందించాడు. బిస్తరు (మూట) చంకలో పెట్టుకొని బురఖా తొలగించుకొంది, ఉక్కబోస్తోంటే.

"అమ్మా!"

"దాదా!"

తల బయటికి పెట్టింది. దాదా కళ్ళు జలజలలాడుతున్నాయి.

"నిన్ను చూడ్డం ఈ జన్మ కిదే ఆఖరిసారనుకుంటాను దాదా". ఆ అమ్మాయి కంఠం ఒణుకుతోంది.

విజిల్ ఊదాడు 'గార్డు'.

పచ్చదీపపు కాంతులుచూసి భయపడి ఒళ్ళు జలదరించేలా కేక పెట్టింది రైలు. నిప్పురవ్వలు విరజిమ్మింది. ఉరి త్రాడులా మెత్తగా పట్టాలపై జారింది రైలు.

దాదా గుండె 'కలుక్కు'మంది.

రైలు కదిలింది.

ఆ పిల్లను స్పృశిస్తూన్న ఆ వృద్ధుని చేతులు కిటికీ ఈవలకు నెట్టివేయబడ్డాయి. నల్లటి రైలుపై విశ్రాంతి తీసికొన్న తెల్లటి వెలుగుమరకలు ఒక్కొక్కటే తప్పుకొంటున్నాయి. వెలుగులో స్పష్టంగా కనిపించిన ఆ అమ్మాయి ముఖం కొద్ది గజాలుపొయ్యేసరికి నల్లగా వికృతంగా అదృశ్యమై పోసాగింది.

దాన్ని అనుసరిస్తూ క్రింద "దాదా' పరుగెత్తుతున్నాడు. అతని పెదవులు ఏదో పలుకుతున్నాయి. పలవరిస్తున్నాయి.

అతనినీడ ఇంత పెద్దగా దయ్యంలాపడి గదులపైబడి పరుగెత్తుతోంది.

"ముసలివాడా! చస్తావ్......ప్రక్కకు తప్పుకో!" అని అరుస్తూన్న తెల్లకోటు మనిషి దాదాను పట్టుకొన్నాడు.

రైలు వెనక్కి వెనక్కి తిరిగి చూసుకొంటూ, మలుపు తిరుగుతూ వెళ్ళిపోయింది—చీకటిలో లీనమైపోయింది.

4

దాదాను తీసికెళ్ళి 'లాకప్'లో పడేశారు. 'దాదా' వెంట వస్తూన్న కుక్కను 'కస్టడీ' లోకి తీసికోలేదు. అందువలన అది బయట పచార్లు కొడుతోంది. దీపపుకాంతిలో పచ్చగా మెరుస్తూన్న కళ్ళతో, దొంగ కార్చుకొంటూ, వాకిలివద్ద నిలబడి, ఇనస్పెక్టరును, పోలీసులను పరీక్షగా చూస్తోంది.

అది లోనికి రావటానికి ప్రయత్నిస్తే పోలీసు దాన్ని వెంటబడి తరుముతున్నాడు. అది ఎన్నిసార్లు తరిమినా, మళ్ళీ మళ్ళీ తోక ఊపుకొంటూ వస్తోందే కానీ, ఆ స్థలాన్ని విడిచి పెట్టటంలేదు.

ఈ తతంగమంతా ఇనస్పెక్టరు ఓరకంటితో చూస్తూనే ఉన్నాడు.

దాదాకేసి చూశాడు.

తప్పించుకుపోవాలనే ఉత్సుకతగానీ, ప్రయత్నంగానీ చెయ్యక, కునుకుపాట్లు పడుతున్నాడు 'మునగడ' తీసికొన్న దాదా.

ఇనస్పెక్టర్ పోలీసుకు సైగ చేశాడు.

"ఒరేయ్—ముసలోడా......నీకు తోడు ఒక కుక్క...... గరీబ్ గాడిద కొడకా"......తుపాకి మడిమతో పొడిచి నిద్రలేపి బయిటికి తోశాడు.

కుక్కపిల్ల పరుగు పరుగున వచ్చి కాళ్ళు నాకింది.

దాదా ప్లాట్‌ఫారంపై కొంతదూరం నడిచాడు, ఖాళీ జాగా దొరుకుతుందేమో పడుకొందామని.

వందలాది ప్రయాణీకులు కాళ్ళూ, చేతులూ 'మావి కాదన్నట్టు' పడవేసి నిద్రబోతున్నారు. అత నెవరో మూట క్రిందబెట్టుకొని వెల్లకిలా పడుకొని నిద్రబోతున్నాడు నోరు తెరచుకొని. పైన 'పంకా' నుండి రాలి పడుతున్న పురుగులు అతని నోట్లో సునాయాసంగా పడుతున్నాయి. అతనెవరో నిద్రబోతూనే కాళ్ళు చరుచుకొంటున్నాడు దోములు కుడ్తూంటే. ఆ దిక్కు

మాలిన కుర్రాడెవడో మూటలా ఉండ చుట్టుకొని అక్కడ పడిఉన్నాడు. బిచ్చగత్తె ఒకర్తె ఆ స్తంభం ప్రక్కగా పడుకొంది. రొమ్ములపై రవికలేదు. శుష్కస్తనాన్ని నోట్లో పెట్టుకొని చీకుతూ, పాలురాక ఏడుస్తోంది ఒక పాప. తల్లిలేచి విసుక్కొంటూ గౌనులేని ఆపిల్ల ఒంటిపై ఒకటి చరిచి 'పడుకో.... పాడుముండా'' అంటూ ప్రక్కకుమళ్ళీ పడుకొంది.

గుట్టలు గుట్టలుగా పడిఉన్న ఆ మూడోతరగతి ప్రయాణికుల విశ్రాంతి స్థలంలో దాదాకు స్థలం దొరకలేదు.

కొంతదూరం నడిచి మూసివేసిన 'టీస్టాల్' ప్రక్కన మేను వాల్చాడు. నిద్ర దూరమైంది. తెల్లవారంగనే ప్రోగయ్యే ఈగల్లా మళ్ళీ ఆలోచనలు ముసురుకోసాగాయి. అతనిచెంత కుక్క ముడుచుకొని పడుకొంది.

దాని శరీరాన్ని ప్రేమతో నిమిరాడు దాదా.

కుక్కలేచింది తోక ఊపుకొంటూ. మెడ సాగబెట్టి కుయ్ కుయ్ మంటూ, దాదా పెదవులు స్పృశించింది.

''బేటా''......అంటూ కుక్కను ఒళ్లోకి తీసికొన్నాడు.

కుక్క చెవులపై కన్నీటిబొట్లు రాలాయి. అది చెవులు టపటప విదిలించుకొంది. గాడిదలా ఓండ్రపెడుతూ, స్టేషన్ లోకి ఒక గూడ్సుబండి వచ్చింది. తెల్లకోటు వేసికొన్న వ్యక్తి, కాకీయూనిఫారమ్ వేసికొన్న మరొక వ్యక్తి దిగారు. అడుగుల్లో అడుగు వేసికొంటూ భారంగా నడుస్తున్నారు దీపాలు చేత బుచ్చుకొని.

''భయంకరమైన దృశ్యం......ఒళ్ళు గగుర్పొడుస్తోంది'' తెల్లకోటు అంటున్నాడు.

''రెండు మూడు రోజులు అన్నం నీళ్ళూ సహించవ్..... ప్రొద్దున్నే ఎవరిముఖం చూశామోకానీ.......చూశావా విధి...... హైదరాబాద్ వదలటంతోనే బ్రతికిపొయ్యామని సంతోషించి ఉంటారు కానీ, వాళ్ళ ప్రాణాలకై ఆ కిరాతకులు పొంచి ఉన్నారని వాళ్ళకేం తెలుసు పాపం.''

కాకీ యూనిఫారమ్ గొంతునుండి మాటలు పెగిలి రావటంలేదు.

దాదాకు ఆతృత హెచ్చింది. గుండె దడదడ కొట్టుకొంది. విషయాలు పూర్తిగా చెప్పమని వాళ్ళను దీనంగా అర్థిస్తున్నాయి అతని దృక్కులు.

వాళ్ళు దాదాకేసి చూడలేదు. మాట్లాడుకొంటూ 'జల్లెడ'లా ఉన్న ఒక తలుపు త్రోసికొని వెళ్ళారు. వాళ్ళ వెనుక తలుపు మూసికొంది.

మరో గూడ్సు కూత విన్పించింది. విజయవాడ వెళ్లే దిశగా 'ఇంజన్' ఉంది. దూరాన ఎర్రగా కనిపిస్తూన్న దీపం పచ్చగా మారిపోయింది.

''ఈ మాల్‌గాడీ (గూడ్సుబండి) ఎంతవరకు?''

చకచకా నడిచి, 'దాదా' ఆ ఇంజన్ డ్రైవర్ కొక సలాం కొట్టి అడిగాడు.

''భద్రాచలం!''—భుగభుగ మంటలుమండే పొయ్యిలో బొగ్గువేసికొంటూ సమాధానం చెప్పాడు.

గిర్రున వెనుతిరిగాడు. కొత్త సత్తువ ఆవహించినట్లు, దయ్యం పట్టినవాడిలా దాదా ఒక వాగెన్ పైకెక్కి దూది బేళ్ళ మధ్య పడుకొన్నాడు. ఒక అర్ధగంటసేపటికి గూడ్సు కదలింది.

గూడ్సుతోపాటు ఒక మైలుదూరం పరుగెత్తి కుక్కపిల్ల వేసారి ఆగిపోయింది.

తెల్లవార్లూ గూడ్సుబండి ఆగుతూ, నిద్రబోతూ తాబేటి నడక నడిచింది. ఏదో స్టేషన్ రాబోతోంది. స్పీడు తగ్గింది.

రాత్రంతా జడలు విరబోసికొని నిద్రించిన నిశాకాంత ఎర్రగా కళ్ళు నలుపుకొంది. కళ్ళు తెరచిచూసేలోగా సూర్యుడుదయించాడని తెలిసి, తెల్లబోయింది. దూదిబేళ్లపై కూర్చున్న 'దాదా' సూర్యోదయాన్ని చూశాడు. తుపాకిగుండు గుండెల్లోనుంచి దూసుకుపోయిన యుద్ధవీరునిలా, రక్తవర్ణంతో కొద్ది కొద్దిగా 'జనగాం'పై పొడుస్తూన్న ఉదయభానుని చూసి శరీరం జలదరించింది.

'స్టేషన్' కొద్ది గజాల దూరంలో ఉంది.

దాదా ప్రక్కకు చూశాడు.

రైలు పట్టాలవెంట కొన్ని పీనుగలు పడి ఉన్నాయి. గుర్తించటానికి వీలు లేకుండా వికృతంగా భయానకంగా ఉన్నాయి. చేతులూ, కాళ్ళూలేని మొండాలు. రైలుకట్టక్రిందకు దొర్లిపోయిం దొక శిరస్సు. ఆ శిరస్సు ఏ మొండానిదో? అది పోయిన త్రోవంతా రక్తపు మరకలు.

'జనగాం'

గూడ్సాగిపోయింది.

దాదా అరచేతులూ, అరికాళ్ళూ నీరు కారి పోసాగాయి. శరీరం తేలిపోసాగింది. వెంటనే 'వాగన్' దిగలేకపొయ్యాడు. రెండు నిముషాలాగి 'హుక్కు' పట్టుకొని వ్రేలాడి దూకాడు.

కొన్ని గజాలు వెనక్కి నడిచాడు.

''ఒక పసిపాప రైలు పట్టాలమధ్య పడిఉంది. నెలల పిల్ల. చెవుల్లోనుండి, ముక్కుల్లోనుండి సన్నగా రక్తపు ధారలు ఎండిపోయి కన్పించుతున్నాయి. చేతులు సన్నగా రోజా రంగులో ముద్దగా ఉన్నాయి. ముక్కు పచ్చలారని ఆ పసికందు నిద్రిస్తూన్నట్లుంది. తల్లి రొమ్మునుండి లాగి రైలు పట్టాలపై విసిరాడొక ధీరుడు, ఆ పాత్తిగుడ్డల పాపను.

'దాదా'తోపాటు కొందరు చూస్తున్నా రా పాపను ప్రదర్శనశాలలో వస్తువును చూసినట్లు. ఎవరి వానాన వాళ్ళు వెళ్ళిపోతున్నారు. కడుపులో చెయ్యి పెట్టుకొని ముందు కొంగి, 'దాదా' ఆ పాపపై నిండుగా గుడ్డ కప్పాడు.

ముక్కు చీదుకొంటూ ప్రక్కకు తిరిగాడు.

ఎదురుగాఉన్న టెలిగ్రాఫ్ స్తంభానికి కట్టివేయబడిం దొక మానవ శరీరం. ఆ శరీరంయొక్కతల ముందుకుబడి నిర్జీవంగా వ్రేలాడుతోంది. చేతులు వెనక్కి విరిచి కట్టివేయబడ్డాయి. ఆ విశాలమైన ఛాతినుండి రెండు మెలికలు తిరిగిన కత్తుల

దూసుకపొయ్యాయి. ఆ పీనుగు దిష్టిబొమ్మలా ఆ స్తంభానికి వ్రేలాడుతోంది.

ఆ శరీరానికిముందు మరొక పీనుగ. అర్ధ నగ్నంగాఉంది. మొలపై వక్షస్థలంపై పూర్తిగా బట్ట తొలిగిఉంది. మెడ క్రింద మాంగల్యం ఉదయభానుని అరుణకాంతిలో 'మిల మిల' మెరుస్తోంది. ఆ పురుషుని కళ్ళముందు ఆ స్త్రీమానహరణ జరిగిన చిహ్నాలున్నాయి.

దాదా ముఖానికి గుడ్డ అడ్డంవేసికొన్నాడు ఒక్కక్షణం.

ఆ పీనుగపై గుడ్డ 'సరిజేసి' బోరగిలా తిప్పాడు దాదా.

నాల్గు గజాలు ముందుకు నడిచాడు.

ఇంతబారుగాఉన్న శిరోజాలు, పేర్చిన రాక్షసిబొగ్గు గుట్టలమధ్య నల్లగా కదలాడుతున్నాయి.

'దాదా' శరీరాన్ని ముందు కీడ్చుకువెళ్లాడు.

మూసికొన్న ఆ విశాలమైన కనురెప్పలు మినహా ముఖం స్పష్టంగా కనిపించటంలేదు. నున్నని ఆ బుగ్గలపై కొరికినట్లు గాట్లు. వక్షస్థలం కోసివేయబడి ఎర్రగా నెత్తురు పేరుకు పోయింది.

శరీరమంతా నగ్నంగా ఉంది కత్తిగాట్లతో. ఒక చెయ్యిలేదు.

దాదా కాళ్ళక్రింద భూమి కృంగిపోసాగింది.

కళ్ళముందు చీకట్లు క్రమ్మాయి.

సూర్యుడు ఆకసంనుండి రాలిపోయినట్టు అంతా చీకటి.

కాళ్ళు నిలబడలేకపొయ్యాయి.

చూపు ప్రక్కకు మరల్చుకొన్నాడు.

అల్లంతదూరాన రక్తపు మడుగు.

ఎర్రటి నెత్తురు.

నల్లగా గడ్డ కట్టుకుపోయింది.

ఆ నెత్తురులో ఒక చెయ్యి మోచేతివరకూ నరకబడిఉంది. పగిలిపోయిన గాజుముక్కలు దానిలో పేరుకపొయ్యాయి.

అతి సుకుమారంగా, మృదువుగా ఉన్న ఆ వ్రేళ్ళు ముడుచుకపొయ్యాయి.

ఆ చేతి ప్రక్కన చెల్లాచెదరయిన ఖర్జూరపు పండ్లు, చీరెలు.

భయ విహ్వలమై పరుగెత్తుతున్న యువతిని వెంటబడి చెరచటానికి ప్రయత్నించి......మానభంగంచేసి, హత్య చేసిన దృశ్యం.

దాదా గొంతు పూడిపోయింది.

పాత దయ్యాలబావిలోపడ్డ వ్యక్తి ఒడ్డు పట్టుకోలేక, వెనుకకు జారిపోతూ, ఊబిలో దిగబడుతున్నట్లు, దాదా కాళ్ళు జారిపోసాగాయి.

కాళ్ళీడ్చుకొంటూ రెండడుగులువేసి ఆ చెయ్యి తీశాడు.

'బేటీ'......అంటూ గుండెలకు ఒత్తుకున్నాడు.

5

"నిన్ను నా చేతులారా చంపాను......మూర్ఖుణ్ణి.....' నా పాపానికి నిష్కృతిలేదు......అల్లా నన్ను క్షమించడు......ఈ చేతులతో నిన్ను పెంచాను......ఈ చేతులతోనే నిన్నువల్లకాటికి సాగనంపాను......బేటీ"......ముసలాడు నుదురు నున్నటి ఆ చలువరాతి మెట్టుపై బలంగా గుద్దుకొన్నాడు.

"దాదా?......ఏమిటా పిచ్చిపని?......పెద్దవాడివి, నాచే చెప్పించుకోవాలా? పోయినవాళ్ళకోసమై బెంగపడితే ప్రయోజనమేముంది......లే" అంటూ ప్రక్కనున్నవ్యక్తి లేవనెత్తాడు.

మసీదులో ప్రార్థన ముగిసింది.

ఆ ఖరీదైన షేర్వాణి అతి కష్టంతో మెట్లు దిగుతున్నాడు గర్భిణిస్త్రీలా. దాదా కోపంగా చూశాడు అటుకేసి. సోదర ముస్లింలు కొందరు దాదా ప్రక్క చేరారు. దాదా యోగక్షేమాలు పరామర్శించి, ఓదార్చి అతని స్మృతిపథంనుండి నైరాశ్యపు భావనలను దూరం చేశారు.

"ఇంటికి వెళ్దామా దాదా". ఒకడన్నాడు.

"ఎందుకు....నే నొక్కడ్నే వెళ్తాను....నువ్వెళ్ళు" అన్నాడు దాదా.

దాదా లేచాడు పీరులా.

మెట్లక్రింద కూచొని 'పైసా......పైసా........సాబ్" అంటూన్న ఒక రోగిష్టి బిచ్చగానికి రెండురూపాయల నోటు వేశాడు.

6

'హుస్సేన్‌సాగర్'లోకి సూర్యుడు దిగజారబోతున్నాడు. వీధుల్లో కార్లు రిక్షాల సందడి ఎక్కువైంది.

దాదా రోడ్డువెంట నడుస్తూంటే, ఒక హిందూ దేవాలయంనుండి భజన కోలాహలం వినబడింది. అనాలోచితంగా అతనికాళ్ళు ఆ దేవాలయ ప్రాంగణంలోకి నడిచాయి.

లోపల పూజ జరుగుతోంది.

'గదంతా సుగంధంతో నిండిపోయింది. ఒక భక్తుడు గణగణ గంట కొడుతున్నాడు నిర్విరామంగా. దానికి లయ కలుపుతూ మరొక నిలయ విద్వాంసుడు మద్దెల వాయించుతున్నాడు. చెవులు బ్రద్దలయి పోతున్నాయి.

దేవాలయపు బురుజుల్లోఉన్న పావురాలు రివ్వున ఎగిరి పొయ్యాయి.

ఒక స్త్రీ తడిబట్టలు కట్టుకొని, జడలు విరబోసికొని గుడిచుట్టూ ప్రదక్షిణాలు చేస్తోంది.

భక్తకోటి కనీస సంఖ్యకు హాజరయ్యారని ధృవపరచుకొని ఆచార్యుడు గొంతు పెగల్చుకొన్నాడు. 'పాండురంగ విఠ్ఠల్' అంటూ ఒక చరణం రాగాలాపన చేయసాగాడు. భక్తకోటి తాళాలు కొట్టుకొంటూ, బండగొంతులతో అనుకరిస్తున్నారు.

ఒక ఐదు నిముషాలు గానమాధుర్యంలో ఓలలాడించి, ఓలలాడిపోయిన అచార్యులు 'పాండురంగవిఠ్ఠల్' అన్న ఒక్క

మాటే లంకించికొని, ఆనందపారవశ్యంలో తన్మయుడై ఊగిపో సాగాడు. మిగతా సుజన బృందం తారస్థాయిలో తాళాలు కొట్టుకొంటూ, ఉన్మాదావస్థలో మారు పలుకుతున్నారు.

ద్వారంచెంత నిలబడి చోద్యం చూస్తున్నాడు దాదా.

ఒక భక్తుడు ఆలస్యమైపోయిందని స్వామి ఆగ్రహానికి గురైపోతానేమోనన్న భయంతో చెమట్లు కక్కుకొంటూ, పీచు తీసిన కొబ్బరికాయ చేత బట్టుకొని విసురుగ్గా లోపల ప్రవేశించబొయ్యాడు. 'దాదా' మురికి షేర్వాణి అంటీ అంట నట్లు అతనికి తగిలింది. టక్కున బ్రేకువేసినట్లాగిపొయ్యాడు.

"అడ్డంలేే......తురక ముండాకొడుకా!......మైలబడి పొయ్యాను......ఇంకేముంది" అని గొణుక్కుంటూ వెళ్ళి ఒక బొక్కెన నీళ్ళు నెత్తిపై పోసికొని మళ్ళీవచ్చాడు.

దాదా కొద్దిదూరం జరిగి అతన్ని 'జూ'లో జంతువులా పరిశీలించసాగాడు. అతను దూరంగా నిలబడి "దూరం—దూరం" అన్నట్టు చేతితో సైగచేసి, మంత్రోచ్చారణ చేసికొంటూ లోనికి వెళ్ళాడు.

దాదాకు విభ్రాంతి కల్గింది.

తన నెందుకలా అసహ్యించుకొన్నాడు—ముస్లిం మతస్థు డనని తన కెలా తెలుసునాని విస్తుబొయ్యాడు—ఎందుకు తెలియదు? క్షుణ్ణంగా తెలిసిపోతుంది.

దాదా గడ్డంచూసికొన్నాడు.

గడ్డం పొడుగ్గా క్రిందకు పెరిగింది. గిజిగానిగూడులా నున్నటి తన తలపై ఎర్రటి కుచ్చుటోపీ వ్రేలాడుతోంది—వేసికొన్న షేర్వాణీ, పైజమా, చెప్పులు అన్నీ వాళ్ళకు విరుద్ధంగానే ఉన్నాయి. ఏ ఒక్క విషయంలోకూడ సామరస్యంలేదు.

లోనికి వెళ్ళిన వ్యక్తిని పరిశీలనగా చూశాడు.

అతని నున్నటి పొట్టమీద సన్నని త్రాడు వ్రేలాడుతోంది. గడ్డంలేదు. మీసాలు లేవు—నున్నగా క్షవరం చేయించుకొన్నాడు. తలంతా నున్నగా గొరికించుకొని మధ్యలో గోష్పాదమంత పిలక చూడ ముచ్చట ఉంది.

వాళ్ళిద్దరిమధ్యను వున్న తారతమ్యం గ్రహించాడు.

అతను గడ్డం 'సాఫ్' చేసికొని తలలో పిలక పెట్టుకొంటే, తనుతలంతా 'సాఫ్' చేయించుకొని గడ్డం పెంచుకొన్నాడు.

మత విశ్వాసాల్లో ఉన్న భేదం, వేషధారణలో కూడా స్పష్టంగా కనుపిస్తోంది.

మత విశ్వాసాలను ఆధారంగా చేసికొని, ఆచార సంప్రదాయాల్లో, వేషభాషల్లో, కల్గిన వ్యత్యాసాలు ఆలోచించాడు. వీటన్నిటికీ అంతర్గతమైన విలువ ఉందా?—లేదా? అన్న మీమాంసలో పడిపొయ్యాడు.

దాదా దృష్టిపథంలో వివిధ మతాలూ, వాటి తాలూకూ ప్రతినిధులు హాజరయ్యారు.

నున్నగా తల గడ్డం మీసాలు గొరిగించుకొని, భిక్షాపాత్ర చేత బట్టుకొని తెల్లని బట్ట మొలకు చుట్టుకొన్నా డొకడు...... అతను బౌద్ధ మతస్థుడు.

గడ్డం, మీసాలు మెలి తిరిగి చెట్టు వ్రేళ్ళులా సాగిపోతూంటే, తల వెంట్రుకలన్నీ ఒక్కచోటేర్చి 'పాగా' చుట్టుకొన్నాడు. వెంట్రుకలపై కత్తి వెయ్యకూడదని అతని నియమం. అతను సిక్కు.

పై రెండు మతాలకు కేశఖండనలో ప్రతికూలభావాలు.

"మెడలో లింగకాయ వ్రేలాడవేసికొని, నొసటిపై అడ్డగీతలు గీచుకొన్నా డొకడు—శైవ మతస్థుడు.

"మెడలో నల్లటి దారంతో 'ప్లస్' గుర్తులాటి రేకు బిళ్ళ వ్రేలాడవేసికొన్నా డొక భక్తుడు. అడ్డంగాఉన్న రేకుకన్న నిలువుగా ఉన్నరేకు పొడవుగా ఉంది—అతను క్రైస్తవ మతస్థుడు.

ఒక్కొక్క మతాని కొక చిహ్నం.

సమాజంలో శాంతి భద్రతలు నెలకొల్పటానికి, మానవుని నైతిక శక్తులు పెంపొందింపచెయ్యటానికీ మతం, మూలాధారం కావచ్చుకానీ, మతాన్ని వ్యక్తపరుస్తూన్న ఈ బాహ్య చిహ్నాలు సామాజిక జీవితంలో ఎన్నో అనర్థకాలు తెచ్చిపెడుతున్నాయి. యుగ యుగాలుగా, తర తరాలుగా సాగిపోతూన్న ఈ చిహ్నాలు మానవులను విడదీసి ఒకరిపట్ల మరొకరికి అసహ్యాన్ని పురికొల్పుతున్నాయి.

దాదాలో అసహ్యం, ఉక్రోషం ముంచుకొచ్చాయి. నెత్తిమీద టోపీతీసి విసిరి పారేశాడు— "బేవకూఫ్‌లోగ్" అని తిట్టుకొంటూ.

గుడిలో పూజ ముగిసింది. దైవనామసంకీర్తనలో శోషించిన భక్తకోటి శ్రమకు ఫలితంగా ప్రసాదం పుచ్చుకొంటున్నారు. చక్కెర పొంగలి, దద్ధోజనం ఇత్యాదులు. దైవ సన్నిధిలో కళ్ళు కద్దుకొని మరీ తింటున్నారు భక్తులు.

దానికోసం బయటవేచి ఉన్నారు వికలాంగులు, దైవ స్వరూపులు—ప్రతినిధులు—మనిషి చనిపోతే ఆసుపత్రి గేటు వద్ద ఎదురు చూస్తున్న బంధువుల్లా. వాళ్ళందరూ ఒక్కసారే 'బాబ్బాబు' అంటూ గందరగోళం చేయసాగారు.

"అరవకండ్రా......దిక్కుమాలిన వెధవల్లారా?" అంటూ బయటి కొచ్చాడు, పులిహోర వడ్డిస్తూన్న అర్చకుడు పళ్లెం పట్టుకొని.

తుప్పు పట్టిన రేకుడబ్బా ముందుకు చాచాడు...... ఒక గూనివాడు.

—వంగిపోయిన నల్లటి రాతివెండిపళ్లెం ఎత్తి పట్టుకొంది—ఒక గుడ్డిది.

"దొరా—నా కిందులో పడెయ్యి—నీ కాళ్ళకు మొక్కుతా దొరా! నీ బానిసోణ్ణి" ఒక చెయ్యి గూడవరకూ విరిగిపోతే, దానికి జోలి తగిలించుకొని, మరో చేత్తో 'జోలి' తెరుస్తూ అంటున్నాడు దీనంగా ఓ అవిటివాడు.

ఈవిధంగా అడుక్కుతినే బొచ్చెలన్నీ ఎత్తిపట్టారు. అర్ధగంట సేపటికి కోలాహలం ముగిసింది.

"ఎవరయినా అందుకోవాల్సినవాళ్ళున్నా(రా" అంటూ నడుం పైకెత్తాడు వడ్డిస్తూన్న భూసురుడు.

"ఇంద" అంటూ చేతిలో పులిహోర పట్టుకొని, దాదాకేసి చూశాడు. దానికోసం దాదా చెయ్యి చాచలేదు. నిర్లక్ష్యంగా అసహ్యంగా అతనికేసి చూశాడు. ఇంకా ఇద్దరు పూజారులా సన్నివేశాన్ని తిలకించారు.

"తురక గాడిద......వాడు తినడులే......అడుక్కు తినే వాడికి కూడా పెద్ద నిక్కు......లోపలికి రా" అన్నాడు ఓ పూజారి.

భిక్షువులందరూ, ప్రసాదం గొంతులో పడవేసికొని, దేవునితో అవసరాన్ని రేపటికి వాయిదా వేసికొని వీథులవెంట పడ్డారు.

7

సంధ్య వెలుగుండగానే, నగర పాలక సంఘ విద్యుద్దీపాలు, కళ్ళు రెపరెప లాడించుకొంటూ నిద్రలేచాయి. విద్యుక్తధర్మాన్ని పాటిస్తూ, సన్నగా గాలి వీచింది. ఒక పాట గాలిలో ఊగుతూ నీరసంగా పయనిస్తున్నది. ఆ గీతం అతని హృదయాంతరాళంలో జాలిగా, విషాదస్వరంతో అస్పష్టమైన లయతో వినవస్తున్నది.

"ఈ జాతి, కుల, మత భేదాలు విస్మరించి, మానవ జాతిసమైక్యతకోసం పాటుపడిన వాళ్లందరూ చరిత్రహీనులై పొయ్యారు. 'దాదా........మరి నీవు' అంటూ ఏదో అనబోయి నవ్విందా కంఠం. వెక్కిరించింది.

దాదాకు ఒళ్ళు మండింది. మెట్లపై నిలబడి కొరకొర చూశాడు దాదా. ఇంతకుక్రితం, ఆలస్యంగా వచ్చి, మైలబడిన భక్తుడు మెట్లు దిగుతున్నాడు.

"ఏరా—నీవు కళ్ళురిమిచూస్తే నాకేం భయమనుకొన్నావా? ఏదో కూటికిలేని వెధవ్వని వదిలిపెడితే......అయినా నీ కిక్కడేం పని?"

దాదా చెంపపై 'ఛడేల్ ఛడేల్'' న దెబ్బలు పడ్డాయి.

"ఈలాటి వాళ్ళను నమ్మకూడదు......చూపులకు అమాయకంగా కనబడ్డా, ఉన్నట్టుండి ఏదో ఒకటి అందుకుపోతారు. దొంగముచ్చు......కొట్టండి". ఒక కంఠం నిర్ణయించింది.

ఇంకా నాలుగు చేతులు కలిశాయి హుషారుగా ఆ మహోత్కృష్ట కార్యనిర్వాహణకై. అసహాయులైన పేదవాళ్ళపై దిక్కులేనివాళ్ళపై చెయ్యిచేసికొని, వారి ధైర్య సాహసాలూ, పౌరుషం నిరూపించుకొంటారు కొందరు.

మెడబట్టి దేవాలయ ప్రాంగణంనుండి బయటికి గెంటారా మానవులు.

నిర్విరామమైన ఘంటారావం.....హిందూ దేవాలయంలో గణగణలు. రెండవసారి ప్రార్థనకు సన్నాహాలు జరుగుతున్నాయి.

దేవాలయపు బురుజుల్లో ఉన్న పావురాలు 'బిలబిల' మంటూ బయటికివెళ్ళిపొయ్యాయి.

అల్లాహో అక్బర్......అల్లాహో

మసీదులో పావురాళ్ళు లేచాయి.

దాదా 'మూసీ'నదివైపు నడుస్తున్నాడు.

పావురాలన్నీకలిసి మైత్రీభావంతో గుంపులు గుంపులుగా ఎగిరిపోతున్నాయి. గాలిలో తేలిపోతున్నాయి.

అల్లాహో......అక్బర్.

గణగణలు.

ఆ రెండు పిలుపులకు అతీతుడైన దాదా చిరునవ్వుతో నీలాలనింగికేసి చూస్తున్నాడు.

మూగ పావురాలు ఎగిరిపోతున్నాయి.